'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 39 | బుధవారం | 23.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 39 | Wednesday | 23.9.2026 | Pages: 8 | Rate: 2



## రెడ్ అలర్ట్

**తెలంగాణపై వాన ముప్పు..**

**ఎనిమిది జిల్లాలకు రెడ్ అలర్ట్**

తెలంగాణలో రాబోయే 24 గంటల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. సెప్టెంబర్ 23న రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తాజా హెచ్చరికలో పేర్కొంది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

2లో..

## వర్షాలపై సీఎం అప్రమత్తత

హైదరాబాద్‌లో భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హైడ్రా, పోలీసు కమిషనర్లు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. (2లో..)

# తెలంగాణ కళలకు ప్రతిబింబాలు

- **వాస్తు వైభవంతో విమానాశ్రయాల నిర్మాణాలు**
- **సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి**



ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలో నిర్మించనున్న తెలంగాణ భవన్ తెలంగాణ చరిత్ర, సంస్కృతికి ప్రతీకలుగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ఈ నిర్మాణాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం, పిల్లలమర్రి దేవాలయం శిల్ప, వాస్తు కళలను పరిశీలించి, వాటి ప్రత్యేకతలు కొత్త నిర్మాణాల్లో ప్రతిబింబించేలా డిజైన్లు రూపొందించాలని సూచించారు. నిర్మాణాల డిజైన్లను పరిశీలించిన సీఎం పలు మార్పులు సూచించారు. ప్రతి కట్టడంలో తెలంగాణ శిల్పకళ, వాస్తు సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. (2లో..)

# దళిత గిరిజనులకు సర్కార్ భరోసా

- **హక్కులు, భద్రతకు సీఎం హామీ**
- **అట్రాసిటీ కేసులపై సమీక్ష**



దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం-1989 అమలుపై రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం అధ్యక్షతన ఇలాంటి సమావేశం జరగడం ఇదే తొలిసారి. కేసుల నమోదు, దర్యాప్తు, కోర్టు విచారణ, పరిష్కారం, బాధితులకు ఆర్థిక సహాయం, పునరావాసంపై సీఎం సమీక్షించారు. ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరును పరిశీలించారు. అట్రాసిటీ బాధితులకు పరిహారం వెంటనే అందేలా గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసుల్లో బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం చేయాలని సూచించారు. (వివరాలు 2లో..)

## రిమ్స్ అగ్నిప్రమాదంపై మంత్రి ఆరా

**శిశువుల భద్రతపై ప్రత్యేక దృష్టి**



# చిన్నారుల మృతికి ప్రభుత్వానిదే బాధ్యత

**రిమ్స్ విషాదంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు**



ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని చిన్నారుల వార్డులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో చిన్నారులు మృతి చెందడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని పేర్కొంటూ, మిగిలిన చిన్నారులకు వెంటనే మెరుగైన వైద్యం అందించి వారి ప్రాణాలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ వైద్యరంగంపై పర్యవేక్షణ లోపించిందని కేటీఆర్ ఆరోపించారు. రిమ్స్ ఆసుపత్రిలోని పరిస్థితులపై బీఆర్ఎస్ నేతలు గతంలోనే ప్రభుత్వాన్ని హెచ్చరించినా పట్టించుకోలేదని విమర్శించారు. చిన్నారుల వార్డులో భద్రతా ఏర్పాట్లు, నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం జరిగిందని ఆయన ఆరోపించారు. అయితే ప్రమాదానికి అసలు కారణాలను అధికారిక దర్యాప్తు ద్వారా నిర్ధారించాల్సి ఉంది. (2లో..)



# రాటు దేలిన రేవంత్

**సీఎం ఆల్వేస్ రైట్.. హైకమాండ్‌కు నో సెకండ్ థాట్**

**రెబల్స్ వ్యూహాలకు బ్రేక్.. ప్రతిపక్షాలకు రోజుకో ఝలక్**

6లో..

బీఆర్ఎస్ ఒత్తిడి, బీజేపీ సవాల్, దానం కేసు చిక్కులు... వీటన్నింటి మధ్య తెలంగాణ కాంగ్రెస్ రాజకీయ చక్రం ఒక్క నాయకుడి చుట్టూనే తిరుగుతోందా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం ఇప్పుడు పార్టీకి సాధారణ అధికారం కాదు.. రాజకీయ అవసరంగా మారిందా? అధిష్ఠానం ముందు ప్రత్యామ్నాయాలు ఉన్నా, ఆ స్థానాన్ని భర్తీ చేయగల నాయకత్వం వెంటనే సిద్ధంగా ఉందా అన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. ఒకవైపు పదేళ్ల పాలనతో బలమైన పునాది ఏర్పరచుకున్న బీఆర్ఎస్, మరోవైపు జాతీయ స్థాయిలో విస్తరిస్తున్న బీజేపీ... మధ్యలో అధికారాన్ని నిలబెట్టుకోవాల్సిన కాంగ్రెస్. ఇంతలో దానం నాగేందర్ వ్యవహారం కోర్టు గడప దాటి సుప్రీంకోర్టు వరకు చేరడంతో పార్టీ మారిన ఎమ్మెల్యేల భవిష్యత్తుపై ఉత్కంఠ పెరిగింది. ఈ తీర్పు ఒక్క దానం నాగేందర్ రాజకీయ భవిష్యత్తునే కాదు.. కాంగ్రెస్‌లో చేరిన ఇతర ఎమ్మెల్యేల ప్రయాణాన్నీ ప్రభావితం చేసే అవకాశముంది. మరోవైపు కర్ణాటకలో కనిపించే బహునాయకత్వానికి భిన్నంగా తెలంగాణలో రేవంత్ కేంద్రంగా నిర్ణయాలు సాగుతున్నాయన్న విశ్లేషణ ఆసక్తి రేపుతోంది. మరి కాంగ్రెస్ హైకమాండ్ రేవంత్ నాయకత్వంపై ఎందుకు ఇంతగా ఆధారపడుతోంది? దానం కేసు వెనుక దాగి ఉన్న అసలు రాజకీయ ప్రశ్న ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానమే తెలంగాణ కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయ దిశను నిర్ణయించబోతుందా?

# నక్సలైట్ వ్యాఖ్యతో సుప్రీంకోర్టులో రగడ

**వందేమాతరం పిటిషన్‌పై వాదనలు**



వందేమాతరం గీతం విషయంలో కేంద్రం తీసుకొచ్చిన 2026 సవరణ చట్టం, కేంద్ర హోంశాఖ ఆదేశాలను సవాల్ చేస్తూ గాయకుడు టి.ఎం. కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పూర్తి ఆరు చరణాల వందేమాతరం గానం విషయంలో మనస్సాక్షి ప్రకారం అభ్యంతరం వ్యక్తం చేసే వారికి శిక్ష ఉండకూడదనే అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. (3లో..)



2లో..

## ఖైరతాబాద్ గణేశ్ దర్శనం

**నేటి రాత్రి వరకు మాత్రమే ఛాన్స్**

ఖైరతాబాద్ మహాగణపతి దర్శనాలు సెప్టెంబర్ 23 బుధవారం రాత్రితో ముగియనున్నాయి. ఈ విషయాన్ని గణేష్ ఉత్సవ కమిటీ ప్రకటించింది. సెప్టెంబర్ 24న షెడ్లు, బారికేడ్ల తొలగింపు సహా ఇతర ఏర్పాట్లను పూర్తి చేయనున్నారు. సెప్టెంబర్ 25న ఉదయం 6 గంటలకు భారీ ట్రక్కుపై ఖైరతాబాద్ గణేశుడిని ఎక్కించి, మధ్యాహ్నం 12 గంటల్లోపు శోభాయాత్రతో పాటు నిమజ్జనం పూర్తి చేయాలని కమిటీ నిర్ణయించింది.



## ఆ భూములు చూపిస్తే అమ్ముకుంటా!

**సర్కారుకు జగదీశ్ రెడ్డి కౌంటర్**

భూములపై వచ్చిన కథనాలను మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి అసెంబ్లీలో తనకు 47 ఎకరాల భూమి ఉందని మాత్రమే చెప్పారని గుర్తుచేశారు. తాజాగా ఓ పత్రికలో తుంగతుర్తిలో 110 ఎకరాలు, మునుగోడులో 80 ఎకరాలు తనకు ఉన్నట్లు కథనం వచ్చిందని తన మిత్రులు చెప్పారని తెలిపారు. ఆ పత్రికను తాను చదవలేదని, తనకు అలాంటి అలవాటు కూడా లేదన్నారు. నిన్న జరిగిన చర్చలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎవరూ ఈ ఆరోపణలు చేయలేదని పేర్కొన్నారు. తన వద్ద నిజంగా అన్ని ఎకరాలు ఉంటే వాటి వివరాలు, హద్దులు చూపించాలని డిమాండ్ చేశారు. (వివరాలు 2లో..)



## తెలంగాణలో రైతుల ఆక్రందనలు

**కరెంట్ ఉత్పత్తిపై తీవ్ర ఆరోపణలు**

**విద్యుత్, సాగునీటిపై హరీశ్ విమర్శలు**

తెలంగాణలో విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాదాద్రి పవర్ ప్లాంట్ 4 వేల మెగావాట్ల సామర్థ్యానికి గాను కేవలం 400 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తోందని పేర్కొన్నారు. యాదాద్రికి అవసరమైన నాణ్యమైన బొగ్గుకు బదులుగా తక్కువ నాణ్యత బొగ్గు వినియోగిస్తున్నారని ఆరోపించారు. కొత్తగూడెంలో 800 మెగావాట్లు, భద్రాద్రిలో 540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందన్నారు. (వివరాలు 2లో..)



## రైతులకు నీళ్లపై రాజకీయం ఎందుకు?

**జూరాల జలాలపై కేటీఆర్‌కు మంత్రుల విమర్శలు**

జూరాల నీటి సమస్యను రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు వాడుకుంటున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. తమ ప్రభుత్వం కర్ణాటకతో ఇప్పటికే సంప్రదింపులు జరుపుతోందని, ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి నీటి ప్రవాహం పెంచేందుకు కర్ణాటకతో మాట్లాడుతున్నామని మంత్రులు తెలిపారు. కృష్ణా జలాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణకు తగిన వాటా దక్కలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం తెలంగాణ హక్కుల కోసం సుప్రీంకోర్టులో పోరాడుతోందని చెప్పారు. (వివరాలు 2లో..)



# "అంతా నా ఇష్టం"..

**ట్రంప్ న్యూసెన్స్.. రోజుకో నాన్సెన్స్..**

**మీడియాపై ఫైర్.. ప్రజా వ్యతిరేకతపై డోన్ట్ కేర్...**

7లో..

అమెరికా అధ్యక్ష పీఠంపై కూర్చున్న ఒక వ్యక్తి... ప్రపంచ రాజకీయాల గమనాన్నే మార్చేస్తున్నాడా? మాటలో మంట.. నిర్ణయంలో దూకుడు.. అడుగులో అగ్రరాజ్యపు అహంకారం.. పేరు డొనాల్డ్ ట్రంప్! "అమెరికా ఫస్ట్" అంటూ మొదలైన ఆయన ప్రయాణం.. ఇప్పుడు అమెరికాకే ఫస్ట్ కష్టమా? అన్న ప్రశ్నకు దారితీస్తోంది. టారిఫ్‌లతో వాణిజ్య యుద్ధం.. ఇరాన్‌తో ప్రత్యక్ష యుద్ధం.. రష్యాతో స్నేహం.. మిత్రదేశాలతో మల్లగుల్లాలు.. మీడియాతో ఢీ.. మార్కెట్లలో కలకలం.. రిపబ్లికన్ పార్టీలో ముసురుకుంటున్న అసంతృప్తి.. ఇవన్నీ కలిస్తే ట్రంప్ పాలన ఓ అధ్యక్షుడి కథ కాదు.. అగ్రరాజ్యానికి అగ్నిపరీక్ష! ఒకవైపు అమెరికా ప్రయోజనాలే తన ధ్యేయమని ట్రంప్ చెబుతుంటే.. మరోవైపు అదే నిర్ణయాలు అమెరికన్ల జేబులకు భారమవుతున్నాయన్న చర్చ. భారత్‌పై సుంకాల పిడుగు.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి.. యుద్ధాలపై పెరుగుతున్న ప్రశ్నలు.. వయసు, ఆరోగ్యంపై ఊహాగానాలు.. తన తరువాతి నాయకత్వంపై రిపబ్లికన్లలో మొదలైన లెక్కలు! ట్రంప్ పూర్తి కాలం పదవిలో ఉంటారా? ఆయన విధానాలు అమెరికాను బలపరుస్తాయా? లేక ప్రపంచాన్ని మరింత సంక్షోభంలోకి నెడతాయా? అసలు ట్రంప్‌ను ఆపేది ఎవరు? పార్టీయా.. ప్రజలా.. మార్కెట్లా.. లేక కాలమేనా? ట్రంప్ తుపాను వెనుక అసలు కథ ఏమిటి?



## ఐక్య రాజ్యసమితి లేకుంటే జంగిల్ రాజ్యమే

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ప్రపంచ దేశాలకు కీలక పిలుపునిచ్చారు. అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్యసమితి వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. ప్రపంచం 'జంగిల్ రాజ్యం' వైపు వెళ్లకుండా ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. గాజాలో శాంతి వచ్చిందని చెబుతున్నా, ప్రజలకు మానవతా సాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి ప్రపంచానికే అవమానకరమన్నారు.



2లో..

## వామ్మో డాక్టర్..!

**నిమ్స్ అధికారి ఆస్తులు ₹ 80 కోట్లు**

**సోదాల్లో భారీ సొత్తులు గుర్తింపు**

నిమ్స్ అదనపు వైద్య సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్‌పై ఏసీబీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. ఆయన నివాసంతో పాటు సంబంధిత వ్యక్తుల ఇళ్లు, కార్యాలయాలు కలిపి 13 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించినట్లు ఏసీబీ తెలిపింది. సోదాల్లో నాలుగు బెడ్‌రూమ్ ఫ్లాట్, కూకట్‌పల్లిలో రెండు ఫ్లాట్లు, మణికొండ, పేట్ బషీర్‌బాద్, కూకట్‌పల్లిలో మరో ఐదు ఫ్లాట్లు, యాదాద్రి, నందిగామ, శామీర్‌పేటలో నాలుగు ఓపెన్ ప్లాట్లు, విశాఖపట్నంలో 800 గజాల స్థలానికి సంబంధించిన పత్రాలు లభించినట్లు అధికారులు పేర్కొన్నారు.



2లో..

## సర్కారు తీపి కబురు

**దసరా నుంచి కొత్త పింఛన్లు**

పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. అక్టోబర్ నుంచి కొత్త పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని నిర్ణయించింది. దసరా పండుగకు ముందే అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

## అక్టోబర్ 16న రాజ్యసభ ఎన్నికలు

**యూపీలో కొత్త లెక్కలు, బీజేపీ ఆధిక్యం**

రాజ్యసభలో 12 స్థానాలకు ఎన్నికల ప్రక్రియకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఉత్తరప్రదేశ్‌లో 10, ఉత్తరాఖండ్‌లో ఒక స్థానం, పశ్చిమ బెంగాల్‌లో ఒక స్థానానికి అక్టోబర్ 16న పోలింగ్ జరగనుంది. (వివరాలు 3లో..)

# రైతులకు నీళ్లపై రాజకీయం ఎందుకు?

## జూరాల జలాలపై కేటీఆర్‌కు మంత్రుల విమర్శలు




**రిజర్వాయర్లు ఎందుకు కట్టలేదు?**

జూరాల సామర్థ్యంలో పూడిక, డెడ్‌స్టోరేజీ, తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుంటే అందుబాటులో ఉన్న నీటిని మొత్తం సాగుకు విడుదల చేయడం సాధ్యం కాదని జూపల్లి వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, తాగునీటికి కూడా ఇబ్బందులు రాకుండా నీటిని జాగ్రత్తగా వినియోగించాల్సి ఉందన్నారు. రైతులకు ఆరుతడి పంటలు సాగు చేయాలని ముందుగానే సూచించినా, చాలామంది వరి సాగు చేశారని తెలిపారు. జూరాల కింద అదనపు రిజర్వాయర్లు నిర్మించి ఉంటే ప్రస్తుత పరిస్థితి వచ్చేది కాదని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. గుడ్డెందొడ్డి రిజర్వాయర్ పనులను తమ ప్రభుత్వం వేగవంతం చేస్తోందన్నారు.

**రైతులకు నీరు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత: వాకిటి**

జూరాల నీటి పరిస్థితిపై వాస్తవాలు తెలుసుకోకుండా బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. రైతులకు నీరు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యతే, తాగునీటి అవసరాలను కాపాడటం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. కర్ణాటక నుంచి నీటి ప్రవాహం పెరిగిన వెంటనే రైతులకు అవసరమైన నీటిని దశలవారీగా అందిస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కర్ణాటక ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. జూరాల అంశాన్ని రాజకీయ రాద్ధాంతంగా మార్చకుండా రైతుల ప్రయోజనాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, భవిష్యత్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకుంటోందని శ్రీహరి స్పష్టం చేశారు.

**జూరాల నీళ్ల కోసం డీకే శివకుమార్‌తో మంత్రుల భేటీ**

ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగు, తాగునీరు అందించే లక్ష్యంతో తెలంగాణ మంత్రుల బృందం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసింది. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి కర్ణాటక ప్రభుత్వంతో జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదలపై చర్చించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి లభ్యతపై ఆందోళన కొనసాగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి అవసరాలు తీరేలా కర్ణాటక నుంచి నీటి ప్రవాహం పెంచే అంశంపై మంత్రులు ప్రధానంగా చర్చించారు. జూరాల ప్రాజెక్టుకు దశలవారీగా నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను తెలంగాణ మంత్రులు కోరారు. ఒక్కసారిగా కాకుండా అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేస్తే రైతులకు సాగునీటి సమస్య తీరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటి విడుదల చేపట్టాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కోరారు.



# తెలంగాణ కళలకు ప్రతిబింబాలు

- **వాస్తు వైభవంతో విమానాశ్రయాల నిర్మాణాలు**
- **సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి**

**శాఖల సమన్వయంతో పనులు వేగం**

విమానాశ్రయాల నిర్మాణ ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు, బీఎస్ఎన్ఎల్ కేబుళ్లు, తాగునీటి పైపులైన్లు, రహదారులు, వాగుల ప్రవాహ మార్పులకు సంబంధించిన సమస్యలను అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఒక్కో శాఖ విడివిడిగా పనులు చేస్తే జాప్యం, ఇబ్బందులు ఎదురవుతాయని రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యుత్, ఆర్అండ్‌బీ, తాగునీరు, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బీఎస్ఎన్ఎల్ అధికారులతో కూడా చర్చించి పనులను ఏకకాలంలో ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

**విశాల రహదారులు.. నీటి నిర్వహణ**

విమానాశ్రయాల కాంపౌండ్ వాల్ సమీపంలో రహదారులు నిర్మించి, వాటిని జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులకు అనుసంధానించాలని సీఎం ఆదేశించారు. విమానాశ్రయాలకు రాకపోకలు సులభంగా ఉండేలా విశాలమైన రహదారులు నిర్మించాలని స్పష్టం చేశారు. వాగులు, ఇతర నీటి ప్రవాహాలను మళ్లించాల్సి వస్తే విమానాశ్రయ ప్రాంగణంలో లేదా సమీపంలో చెరువులు నిర్మించి నీటిని మళ్లించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, విమానయాన శాఖ అధికారులు, స్థపతి ఈమని శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ వర్షాలపై సీఎం అలర్ట్

హైదరాబాద్‌లో భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హైడ్రా, పోలీసు కమిషనర్లు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రధాన రహదారులు, జంక్షన్లు, కాలనీల్లో వర్షపు నీరు నిలవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, ఇప్పటికే నీరు చేరిన ప్రాంతాల్లో సిబ్బంది, యంత్రాలను వెంటనే రంగంలోకి దించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ వ్యవస్థలకు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నాలాలు, డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని, కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సహాయక చర్యలను వేగంగా చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణలో రైతుల ఆక్రందనలు

- **విద్యుత్ ఉత్పత్తిపై తీవ్ర ఆరోపణలు**
- **విద్యుత్, సాగునీటిపై హరీశ్ విమర్శలు**

తెలంగాణలో విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాదాద్రి పవర్ ప్లాంట్ 4 వేల మెగావాట్ల సామర్థ్యానికి గాను కేవలం 400 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తోందని పేర్కొన్నారు. యాదాద్రికి అవసరమైన నాణ్యమైన బొగ్గుకు బదులుగా తక్కువ నాణ్యత బొగ్గు వినియోగిస్తున్నారని ఆరోపించారు. కొత్తగూడెంలో 800 మెగావాట్లు, భద్రాద్రిలో 540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందన్నారు.. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు కొరత ఎందుకు వచ్చిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లిన తనను పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు.

**ఏపీలో నీళ్లు.. తెలంగాణలో ఎండిన పంటలు**

సాగునీటి విషయంలోనూ తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు విమర్శించారు. ఏపీలో రైతులు కేరింతలు కొడుతుంటే తెలంగాణలో రైతుల ఆక్రందనలు వినిపిస్తున్నాయని అన్నారు. తెలంగాణ రైతులకు 7-8 గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. శ్రీశైలం నీటిని కుప్పం వైపు తరలిస్తున్నారని, తెలంగాణ ప్రాజెక్టులకు మాత్రం నీరు అందడం లేదని పేర్కొన్నారు. ఎల్‌నినోపై పరిస్థితిని నెట్టివేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ఒత్తిడితోనే మంత్రులు కర్ణాటకకు వెళ్లారని వ్యాఖ్యానించారు. గులాబీ చొక్కాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని మంత్రి పొంగులేటి వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రి సీతక్క తల్లిదండ్రులకు పోడు పట్టాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. రైతుల సమస్యలు, విద్యుత్, నీటి అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు



# దళిత గిరిజనులకు సర్కార్ భరోసా

- **హక్కులు, భద్రతకు సీఎం హామీ**
- **అట్రాసిటీ కేసులపై సమీక్ష**

**73 గ్రామాలపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలో గత ఐదేళ్లుగా ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసులు క్రమంగా తగ్గుతున్నాయని అధికారులు వివరించారు. అయితే కొన్ని జిల్లాల్లోని 73 గ్రామాల్లో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని తెలిపారు. ఆయా ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు. జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. బాధితుల పట్ల ప్రభుత్వం మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని, సకాలంలో పరిహారం, సహాయం, పునరావాసం అందించాలని స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధితోనే అణిచివేతకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సీఎం పేర్కొన్నారు.

**సంక్షేమంలో ప్రత్యేక ప్రాధాన్యం**

దళితులు, గిరిజనులకు ప్రభుత్వ పథకాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లలో 31 శాతం ఎస్సీలకు, 17 శాతం ఎస్టీలకు కేటాయించినట్లు చెప్పారు. జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు అల్పాహారం అందిస్తున్నామని, 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. చదువు జీవితాలను మార్చే శక్తి అని, పిల్లలను విద్యతో పాటు క్రీడల వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. "ఈ ప్రభుత్వం మీది.. మీ సంక్షేమం, అభివృద్ధి కోసమే పనిచేస్తుంది" అని సీఎం భరోసా ఇచ్చారు.



# చిన్నారుల మృతికి ప్రభుత్వానిదే బాధ్యత

- **రిమ్స్ విషాదంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు**
- **అన్ని ఆసుపత్రుల్లో భద్రతా తనిఖీలు**



ఆదిలాబాద్ రిమ్స్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చిన్నారుల వార్డులు, ఐసీయూలను నిపుణులతో తనిఖీ చేయించాలని కేటీఆర్ సూచించారు. ఫైర్ సేఫ్టీ, విద్యుత్ వ్యవస్థ, అత్యవసర పరిస్థితుల్లో తరలింపు ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రమాదంలో తమ పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే ఈ ఘటనకు బాధ్యత వహించాలని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ ఆరోపణలుగా ఉన్నాయి; ప్రమాదానికి సంబంధించి ప్రభుత్వ స్థాయిలో విచారణ జరుగుతోంది.



# రిమ్స్ అగ్నిప్రమాదంపై మంత్రి ఆరా

**శిశువుల భద్రతపై ప్రత్యేక దృష్టి**

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ నియోనాటల్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ)లో సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదం నేపథ్యంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆసుపత్రిని సందర్శించారు. ప్రమాదం అనంతరం చేపట్టిన రెస్క్యూ, సహాయక చర్యలను పరిశీలించారు. ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న శిశువులను సురక్షితంగా ఇతర వార్డులకు తరలించిన విధానంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి, మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అగ్నిప్రమాదం నేపథ్యంలో చిన్నారుల కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

**రిమ్స్ అగ్నిప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి**

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని ఎస్ఎన్‌సీయూ వార్డులో జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు చిన్నారులు మృతి చెందడంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని పేర్కొంటూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇతర చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. వారికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అగ్నిప్రమాదానికి దారితీసిన కారణాలను పూర్తిస్థాయిలో విచారించి సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# ఆ భూములు చూపిస్తే అమ్ముకుంటా!

## సర్కారుకు జగదీశ్ రెడ్డి కౌంటర్



భూములపై వచ్చిన కథనాలను మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి అసెంబ్లీలో తనకు 47 ఎకరాల భూమి ఉందని మాత్రమే చెప్పారని గుర్తుచేశారు. తాజాగా ఓ పత్రికలో తుంగతుర్తిలో 110 ఎకరాలు, మునుగోడులో 80 ఎకరాలు తనకు ఉన్నట్లు కథనం వచ్చిందని తన మిత్రులు చెప్పారని తెలిపారు. ఆ పత్రికను తాను చదవలేదని, తనకు అలాంటి అలవాటు కూడా లేదన్నారు. నిన్న జరిగిన చర్చలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎవరూ ఈ ఆరోపణలు చేయలేదని పేర్కొన్నారు. తన వద్ద నిజంగా అన్ని ఎకరాలు ఉంటే వాటి వివరాలు, హద్దులు చూపించాలని డిమాండ్ చేశారు.

**ఎక్కడున్నాయో చూపిస్తే అమ్మేస్తా**

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన జగదీష్‌రెడ్డి, తనపై వరుసగా కథనాలు రాయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తుంగతుర్తి, మునుగోడులో చెప్పిన భూములు ఎక్కడున్నాయో చూపిస్తే కనీసం అమ్ముకోనైనా అమ్ముకుంటానని వ్యాఖ్యానించారు. భూముల హద్దులు చూపించాలని, ఆధారాలతో ఆరోపణలు చేస్తే సమాధానం ఇస్తానని అన్నారు. తన రాజకీయ ప్రయాణంలో ప్రజా సమస్యలపై తిరుగుతున్నా గతంలో తన వార్తలకు ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. సంబంధిత పత్రికాధిపతిపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, కాంగ్రెస్ నేతల కంటే ఎక్కువగా తనపై విమర్శలు చేస్తున్నారని జగదీష్‌రెడ్డి ఆరోపించారు.

# తెలంగాణపై వాన ముప్పు.. రెడ్ అలర్ట్

**ఎనిమిది జిల్లాలకు రెడ్ అలర్ట్**

తెలంగాణలో రాబోయే 24 గంటల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. సెప్టెంబర్ 23న రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తాజా హెచ్చరికలో పేర్కొంది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో 20 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 23, 24 తేదీల్లో అత్యంత భారీ వర్షాల ముప్పు ఉన్నట్లు ఐఎండీ తాజా హెచ్చరికలు వెల్లడిస్తున్నాయి.

**లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరిక**

భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకపోవడం మంచిదని హెచ్చరించారు. సహాయక చర్యలకు అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. వర్షాల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున ప్రజలు స్థానిక అధికారుల సూచనలు పాటించాలని కోరింది. ఐఎండీ ప్రకారం సెప్టెంబర్ 22 నుంచి 26 వరకు తెలంగాణలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాల పరిస్థితులు కొనసాగవచ్చు.



# వామ్మో డాక్టర్..!

- **నిమ్స్ అధికారి ఆస్తులు ₹ 80 కోట్లు**
- **సోదాల్లో భారీ ఆస్తుల గుర్తింపు**

**భారీగా ఆస్తులు గుర్తింపు**

నిమ్స్ వైద్యుడు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ ఆస్తులపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దృష్టిసారించారు. ఆయన నివాసంతో పాటు మరో ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో దాదాపు రూ.80 కోట్లకుపైగా విలువైన స్థిర, చరాస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం.

**బ్యాంకులు.. పోస్టాఫీసుల్లో భారీ డిపాజిట్లు**

ఏసీబీ వివరాల ప్రకారం రూ.6.13 కోట్ల విలువైన ఆస్తులు గుర్తించినట్లు సమాచారం. బ్యాంకుల్లో రూ.8.41 లక్షలు, పోస్టాఫీసులో రూ.12 లక్షల డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్లలో రూ.29.55 లక్షలు, ప్రైవేట్ సంస్థల్లో రూ.35 లక్షల పెట్టుబడులు, 517.8 గ్రాముల బంగారం ఉన్నట్లు పేర్కొంది. జాగ్వార్, ఆడి, టాటా నెక్సాన్ సహా నాలుగు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు కూడా గుర్తించినట్లు ఏసీబీ తెలిపింది. మరో ఫ్లాట్ కొనుగోలుకు రూ.1.30 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు, పలువురికి రూ.1.33 కోట్ల రుణాలు ఇచ్చినట్లు వెల్లడించింది. తెలిసిన ఆదాయ వనరులతో పోలిస్తే ఆస్తులు అధికంగా ఉన్నాయన్న ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోంది.



# సర్కారు తీపి కబురు

## దసరా నుంచి కొత్త పింఛన్లు

పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. అక్టోబర్ నుంచి కొత్త పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని నిర్ణయించింది. దసరా పండుగకు ముందే అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. పంచాయతీరాజ్ మంత్రి సీతక్క ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టారు. క్షేత్రస్థాయి పరిశీలనను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా అర్హత నిర్ధారణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని వినియోగించాలని ఆదేశించారు. మొత్తం ప్రక్రియను పర్యవేక్షించే బాధ్యతను సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్‌కు అప్పగించారు. కొత్త పింఛన్లను అక్టోబర్ 1 నుంచి ప్రారంభించనున్నట్లు తాజా నివేదికలు కూడా పేర్కొన్నాయి.

**5.98 లక్షల దరఖాస్తులు**

రాష్ట్రవ్యాప్తంగా కొత్త పింఛన్ల కోసం 5,98,193 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి 46,540 దరఖాస్తులు రాగా, ములుగు నుంచి 4,818 దరఖాస్తులు వచ్చాయి. విభాగాల వారీగా చూస్తే వితంతు పింఛన్ల కోసం 3.31 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. పూర్తి అర్హత ఉన్న ఒంటరి మహిళలు, వితంతువులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత పాటించి, నిజమైన అర్హులందరికీ ప్రయోజనం అందేలా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో వెరిఫికేషన్ పూర్తికాగా, మిగిలిన ప్రాంతాల్లో ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దసరా నాటికి కొత్త పింఛన్లు అందించడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోంది.





# ఖైరతాబాద్ గణేశ్ దర్శనం

## నేటి రాత్రి వరకు మాత్రమే ఛాన్స్

నిమజ్జనం పూర్తి చేయాలని కమిటీ నిర్ణయించింది. దీంతో భక్తులు బుధవారం రాత్రిలోపే బడా గణేశుడిని దర్శించుకోవాలని కోరింది. హైదరాబాద్‌లో దాదాపు 1.5 లక్షల గణేష్ మండపాలు ఏర్పాటైనట్లు సమాచారం. ప్రధాన నిమజ్జనం రోజున సుమారు 50 లక్షల మంది భక్తులు శోభాయాత్రలో పాల్గొనే అవకాశం ఉందని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అంచనా వేసింది.

**నిమజ్జనానికి భారీ ఏర్పాట్లు**

అనంత చతుర్దశి సందర్భంగా సెప్టెంబర్ 25న నగరవ్యాప్తంగా వేలాది విగ్రహాల నిమజ్జనం జరగనుంది. గతేడాదితో పోలిస్తే ఈసారి నిమజ్జనాన్ని వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. హుస్సేన్‌సాగర్‌తో పాటు సరూర్‌నగర్, కాప్రా, అమీన్‌పూర్ సహా 150కుపైగా ప్రాంతాల్లో నిమజ్జన కేంద్రాలు, 110 బేబీ పాండ్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్షకుపైగా విగ్రహాల నిమజ్జనం పూర్తైనట్లు సమాచారం. రద్దీ దృష్ట్యా సెప్టెంబర్ 23 నుంచి 25 వరకు ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమల్లో ఉంటాయి. భక్తులు, వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించి ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని అధికారులు సూచించారు.





# నక్సలైట్ వ్యాఖ్యతో సుప్రీంకోర్టులో రగడ

## వందేమాతరం పిటిషన్‌పై వాదనలు

వందేమాతరం గీతం విషయంలో కేంద్రం తీసుకొచ్చిన 2026 సవరణ చట్టం, కేంద్ర హోంశాఖ ఆదేశాలను సవాల్ చేస్తూ గాయకుడు టి.ఎం. కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పూర్తి ఆరు చరణాల వందేమాతరం గానం విషయంలో మనస్సాక్షి ప్రకారం అభ్యంతరం వ్యక్తం చేసే వారికి శిక్ష ఉండకూడదనే అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ఎస్. మురళీధర్ మాట్లాడుతూ ఇలాంటి అంశాలపై విస్తృత ప్రజాభిప్రాయం, చర్చ అవసరమని వాదించారు.

**నక్సలైట్ వ్యాఖ్యతో తీవ్ర వాగ్వాదం**

చట్టాల రూపకల్పన రాజ్యాంగ ప్రక్రియలోనే జరుగుతుందని, అది నక్సలైట్ల ఆలోచనా విధానంలో జరగదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యాఖ్యానించారు. దీనిపై మురళీధర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆ పదాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. "ఇలాంటి వ్యాఖ్యలు ప్రభుత్వ న్యాయాధికారికి తగవు" అని ఆయన స్పష్టం చేశారు. మెహతా మాత్రం తన వ్యాఖ్యను వెనక్కి తీసుకోలేదు. పార్లమెంట్ ద్వారానే నిర్ణయాలు జరుగుతాయని, అదే రాజ్యాంగబద్ధమైన విధానమని వివరణ ఇచ్చారు.

**ఆలోచించడం నేరం కాదన్న కోర్టు**

ఈ వివాదంలో సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే "సొంతంగా ఆలోచించడం నక్సలైట్ కావడం కాదు" అని వ్యాఖ్యానించారు. జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ స్పందిస్తూ ఎవరికైనా ఒక ముద్ర వేసినంత మాత్రాన వారి రాజ్యాంగ హక్కులు కోల్పోరని స్పష్టం చేశారు. ప్రతి పౌరుడికి రాజ్యాంగం ప్రకారం నిరసన తెలిపే హక్కు ఉందని పేర్కొన్నారు. చివరకు వ్యాఖ్యలపై తాము దృష్టి పెట్టడం లేదని, వందేమాతరం కేసులోని రాజ్యాంగపరమైన అంశాలకే పరిమితమవుతామని ధర్మాసనం తెలిపింది. కేంద్రం నుంచి కౌంటర్ అఫిడవిట్ కోరింది.

# రామ మందిర విరాళాలపై చార్జ్‌షీట్ ఇంకెన్నాళ్లు

## ఆలస్యంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు

అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేయడంలో జరుగుతున్న ఆలస్యంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. "రామ్ కా నామ్ బద్నామ్ నా కరో" అంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బీజేపీపై విమర్శలు చేశారు. కేసు దర్యాప్తు ప్రారంభమై దాదాపు మూడు నెలలు పూర్తవుతున్నా ఇప్పటివరకు చార్జ్‌షీట్ ఎందుకు దాఖలు కాలేదని ప్రశ్నించారు. సెప్టెంబర్ 25లోగా చార్జ్‌షీట్ దాఖలు చేయకపోతే నిందితులకు చట్టప్రకారం డిఫాల్ట్ బెయిల్ లభించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో దర్యాప్తు సంస్థలు పెద్ద నిందితులను కాపాడుతున్నాయనే అనుమానం ప్రజల్లో ఉందని జైరాం రమేశ్ ఆరోపించారు.



**70 కాదు.. 105 చోరీలు?**

మందిర ప్రాంగణంలోని సీసీటీవీ ఫుటేజీల ఫోరెన్సిక్ పరిశీలనలో విరాళాల చోరీకి సంబంధించిన 105 ఘటనలు గుర్తించినట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలిపిన విషయాన్ని కాంగ్రెస్ ప్రస్తావించింది. గతంలో ప్రాథమిక దర్యాప్తులో 70 ఘటనలు మాత్రమే వెలుగులోకి వచ్చాయని తెలిపింది. అసలు ఈ వ్యవహారం వెనుక ఉన్న కీలక వ్యక్తులు ఎవరు? వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వీడాలని, ట్రస్టు బాధ్యతపై కూడా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు ఎందుకు జరగకూడదని ప్రశ్నించారు.

**ఫోరెన్సిక్ ఆడిట్‌కు కాంగ్రెస్ డిమాండ్**

కేసులో మొత్తం వ్యవస్థపై పూర్తి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. దర్యాప్తు పూర్తిగా పారదర్శకంగా సాగాలని జైరాం రమేశ్ స్పష్టం చేశారు. మరోవైపు సుప్రీంకోర్టులో దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం సెప్టెంబర్ 25లోగా తొలి చార్జ్‌షీట్ దాఖలు చేస్తుందని సొలిసిటర్ జనరల్ తెలిపారు. తొలి అరెస్ట్ నుంచి 90 రోజుల గడువు అదే రోజుతో ముగియనుందని, ఆలోపు చార్జ్‌షీట్ దాఖలు చేయకపోతే నిందితులకు చట్టబద్ధ డిఫాల్ట్ బెయిల్ హక్కు ఏర్పడుతుందని కోర్టుకు వివరించారు. ఇప్పటికే ఎస్ఐటీ సమర్పించిన స్థితిగతుల నివేదికను సుప్రీంకోర్టు పరిశీలించింది.

# విరాళాల చోరీ కేసులో నిందితులకు షాక్

**ముగ్గురి బెయిల్ పిటిషన్లు తిరస్కరణ**

అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల నగదు, విలువైన వస్తువుల అక్రమ మళ్లింపు ఆరోపణల కేసులో ముగ్గురు నిందితులకు బెయిల్ నిరాకరించారు. అవినీతి నిరోధక ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రాజత్ వర్మ సోమవారం అవినాశ్ శుక్లా, మనీష్ కుమార్ యాదవ్, రామ్ శంకర్ మిశ్రా బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపి వాటిని తిరస్కరించారు. ఈ ముగ్గురు సహా మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. సెప్టెంబర్ 21 వరకు వారి జ్యుడీషియల్ కస్టడీ కొనసాగింది. పోలీసులు ఇప్పటివరకు చార్జ్‌షీట్ దాఖలు చేయలేదని నిందితుల తరపు న్యాయవాది వాదించినా కోర్టు బెయిల్ మంజూరు చేయలేదు.

**వర్తించని సెక్షన్లపై నిందితుల వాదన**

నిందితులపై అవినీతి, ప్రభుత్వ ఉద్యోగి నమ్మక ద్రోహానికి సంబంధించిన నిబంధనలు నమోదు చేయడం సరికాదని రక్షణ న్యాయవాదులు వాదించారు. నిందితులు ప్రభుత్వ ఉద్యోగులు కాదని, కాబట్టి ఆ సెక్షన్లు వర్తించవని పేర్కొన్నారు. వాటిని తొలగిస్తే మిగిలిన నేరాలకు గరిష్ఠంగా ఏడేళ్ల శిక్ష మాత్రమే ఉంటుందని, ప్రత్యేక పరిస్థితులు లేనందున బెయిల్ ఇవ్వొచ్చని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే వాదనలు విన్న అనంతరం న్యాయస్థానం ముగ్గురి బెయిల్ పిటిషన్లను తిరస్కరించింది.

**రూ.79.85 లక్షలు స్వాధీనం**

ఈ కేసులో మొత్తం ఎనిమిది మంది నిందితులు జైలులో ఉన్నారు. వారిలో ఎక్కువ మంది రామ మందిరంలో విరాళాల నగదు లెక్కింపు విధుల్లో ఉన్న బ్యాంకు ఉద్యోగులు. విరాళాల లెక్కింపు ప్రక్రియకు సుభాష్ శ్రీవాస్తవ బాధ్యత వహించినట్లు పోలీసులు పేర్కొన్నారు. రామ్‌శంకర్ అలియాస్ టిన్నూ యాదవ్ డ్రైవర్‌గా పనిచేసేవాడని దర్యాప్తులో వెల్లడైంది. జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత అరెస్టులు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదిక ఆధారంగా కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు రూ.79.85 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ప్రాసిక్యూషన్ తెలిపింది. మిగిలిన నిందితుల బెయిల్ పిటిషన్లపై సెప్టెంబర్ 22, 23 తేదీల్లో విచారణ జరగనుంది.



# ఢిల్లీలో నేరాలకు బాధ్యులెవరు?

- దేశంలో మహిళలకు భద్రత ఎక్కడ?
- పెరుగుతున్న దాడులపై ప్రియాంక ఫైర్



దేశంలో మహిళలపై పెరుగుతున్న లైంగిక దాడులపై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులు భయానకంగా మారుతున్నాయని, గతంలోనూ భద్రత సమస్యగా ఉన్నా ఇప్పుడు హింసాత్మక ఘటనలు మరింత పెరుగుతున్నాయని ఆమె అన్నారు. పెద్ద పథకాలు, కార్యక్రమాల గురించి మాట్లాడటం కంటే ముందుగా మహిళలు రోడ్లపై స్వేచ్ఛగా, భయంలేకుండా తిరిగే పరిస్థితి కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె కోరారు. మహిళలకు రక్షణ కల్పించే విధానాలపై ప్రభుత్వాలు తీవ్రంగా ఆలోచించి, సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఢిల్లీలో వరుస ఘటనలు**

దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల మైనర్ బాలికలపై వరుస లైంగిక దాడులు వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. సెప్టెంబర్ 10న స్వరూప్ నగర్‌లో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన నమోదైంది. సెప్టెంబర్ 16న సదర్ బజార్‌లో స్టేషనరీ కొనుగోలు చేసేందుకు వెళ్లిన బాలికపై లైంగిక దాడి జరిగింది. సెప్టెంబర్ 21న ఆరేళ్ల బాలికపై ఒక ఘటన, 17 ఏళ్ల బాలికపై మరో లైంగిక దాడి చోటుచేసుకున్నాయి. బిహార్‌లోని జముయి ప్రాంతంలో ఇంటికి వెళ్తున్న పదో తరగతి చదువుతున్న బాలిక, బాలుడిని కొందరు వ్యక్తులు రోడ్డుపై వేధించిన ఘటన కూడా వెలుగులోకి వచ్చింది.

**భద్రతపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి**

వయనాడ్ లోక్‌సభ సభ్యురాలిగా ఉన్న ప్రియాంక గాంధీ ప్రస్తుతం కేరళలో పర్యటిస్తున్నారు. మహిళలు సురక్షితంగా బయటకు వెళ్లగలిగే వాతావరణం కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు భయపడకుండా జీవించే పరిస్థితులు ఎలా కల్పించాలనే అంశంపై ఆలోచించాలని కోరారు. వయనాడ్ పర్యటనలో ఎక్కువ మందిని కలుసుకుని వారి సమస్యలను లోతుగా తెలుసుకోవాలని భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వాటిపై తగిన చర్యలు తీసుకోవడమే తన పర్యటన ఉద్దేశమని చెప్పారు.

# అక్టోబర్ 16న రాజ్యసభ ఎన్నికలు

- యూపీలో కొత్త లెక్కలు, బీజేపీ ఆధిక్యం

రాజ్యసభలో 12 స్థానాలకు ఎన్నికల ప్రక్రియకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఉత్తరప్రదేశ్‌లో 10, ఉత్తరాఖండ్‌లో ఒక స్థానం, పశ్చిమ బెంగాల్‌లో ఒక స్థానానికి అక్టోబర్ 16న పోలింగ్ జరగనుంది. అవసరమైతే అదే రోజు ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఉత్తరప్రదేశ్‌లో ఖాళీ అవుతున్న 10 స్థానాల్లో ప్రస్తుతం బీజేపీకి చెందిన ఎనిమిది, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఒకటి, బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన ఒక స్థానం ఉన్నాయి. యూపీ అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్య ఆధారంగా రాజ్యసభ ఎన్నికల్లో పార్టీల బలాబలాలు నిర్ణయమవుతాయి.

**బీజేపీ కూటమికి సంఖ్యాబలం**

ప్రస్తుత అసెంబ్లీ బలాన్ని పరిశీలిస్తే బీజేపీ నేతృత్వంలోని కూటమికి సుమారు 290 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని అంచనా. ఎస్పీ-కాంగ్రెస్ కూటమికి సుమారు 103 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక్క రాజ్యసభ స్థానానికి దాదాపు 37 ఓట్లు అవసరమయ్యే పరిస్థితిలో బీజేపీ కూటమి ఏడు స్థానాలను సులభంగా గెలుచుకునే స్థితిలో ఉందని లెక్కలు సూచిస్తున్నాయి. మరో రెండు స్థానాలు ఎస్పీ-కాంగ్రెస్ కూటమికి దక్కే అవకాశం ఉంది. 10వ స్థానం మాత్రం హోరాహోరీగా మారే అవకాశం కనిపిస్తోంది. బీజేపీ కూటమికి సుమారు 31 ఓట్లు, ప్రతిపక్ష కూటమికి 29 ఓట్లు ఉండటంతో ఆ స్థానంపై ఆసక్తి పెరిగింది. ఇవి ప్రస్తుత ఎమ్మెల్యేల బలాన్ని ఆధారంగా చేసుకున్న అంచనాలు మాత్రమే.

**బీఎస్పీకి రాజ్యసభ ఉనికిపై ప్రశ్న**

ఈ ఎన్నికలు బీఎస్పీ రాజ్యసభ ప్రాతినిధ్యానికి కీలకంగా మారాయి. పార్టీకి లోక్‌సభలో ప్రస్తుతం సభ్యుడు లేరు. యూపీలో ఉన్న ఏకైక బీఎస్పీ ఎమ్మెల్యే ఉమాశంకర్ సింగ్ ఆగస్టులో మరణించారు. బీఎస్పీ రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతమ్ పదవీకాలం నవంబర్‌లో ముగియనుంది. గతంలో 2020లో బీజేపీ 10 స్థానాలకు ఎనిమిది మంది అభ్యర్థులను మాత్రమే నిలబెట్టడంతో బీఎస్పీకి ఒక స్థానం దక్కింది. ఇక ఉత్తరాఖండ్‌లో బీజేపీకి అసెంబ్లీలో స్పష్టమైన మెజారిటీ ఉండటంతో అక్కడి రాజ్యసభ స్థానాన్ని తిరిగి దక్కించుకునే అవకాశం ఉందని వార్తా నివేదికలు పేర్కొంటున్నాయి. సెప్టెంబర్ 29న నోటిఫికేషన్, అక్టోబర్ 6 వరకు నామినేషన్లు, అక్టోబర్ 16న పోలింగ్ జరగనున్నాయి.



# డీఎస్సీ దుమారం

- దాడులతో ప్రశ్నలు ఆపలేరు
- లోకేశ్ రాజీనామాకు జూపూడి డిమాండ్!



డీఎస్సీ నియామకాలపై ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నేతలు, అభ్యర్థులపై దాడులు చేయడం ద్వారా ప్రభుత్వం సమాధానం నుంచి తప్పించుకోవాలని చూస్తోందని పార్టీ ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు ఆరోపించారు. విజయవాడ శాప్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన సందర్భంగా పోలీసుల సమక్షంలోనే దాడులు జరిగాయని, అనంతరం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కేసులు పెట్టారని ఆయన విమర్శించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని గత మూడు నెలలుగా జగన్ ప్రశ్నిస్తున్నారని తెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకుండా భౌతిక దాడులకు దిగడం ప్రజాస్వామ్య పద్ధతి కాదని అన్నారు. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

**లోకేశ్ రాజీనామా చేయాలి**

డీఎస్సీ నియామకాలపై ప్రభుత్వం నిజాయితీగా వ్యవహరించి ఉంటే సీబీఐ దర్యాప్తుకు ఎందుకు వెనుకాడుతోందని జూపూడి ప్రశ్నించారు. కేంద్రంలో నీట్ వ్యవహారంపై జరిగిన నిరసనల సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ.. బాధ్యత వహించిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అదే తరహాలో డీఎస్సీ వివాదంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నైతిక బాధ్యత తీసుకుని రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. టీచర్లతో పోటీ ధర్నాలు నిర్వహించడం, నిరసనకారులపై కేసులు నమోదు చేయడం ఆపాలని సూచించారు. ప్రభుత్వం ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోలేదని అన్నారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరిగే వరకు, లోకేశ్ రాజీనామా చేసే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుందని జూపూడి ప్రభాకర్‌రావు స్పష్టం చేశారు.

# సీబీఐ విచారణపై ఎందుకంత భయం?

- ప్రభుత్వం మారితే చట్టప్రకారం చర్యలు
- డీఎస్సీపై పోరాటం ఆపమన్న అంబటి



డీఎస్సీ-2025 స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ విజయవాడ శాప్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నిర్వహించిన నిరసనపై మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న పార్టీ నేతలు, విద్యార్థులు, యువజన విభాగాలపై పోలీసుల సమక్షంలో టీడీపీకి చెందిన రౌడీ మూకలతో కర్రలు, రాళ్లతో దాడులు చేయించారని ఆయన ఆరోపించారు. ఈ ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు.. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపైనే కేసులు నమోదు చేశారని విమర్శించారు. సుమారు 250 మందిపై కేసులు పెట్టారని, 307తో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు నమోదు చేశారని ఆరోపించారు. ఘటనాస్థలంలో లేని వారిపైనా కేసులు పెట్టడం దారుణమని అన్నారు. తమ వద్ద దాడులకు సంబంధించిన వీడియో ఆధారాలు ఉన్నాయని, వాటిని కోర్టులో సమర్పిస్తామని తెలిపారు.

**సీబీఐ విచారణపై ఎందుకంత భయం?**

డీఎస్సీలో 16 వేలకుపైగా పోస్టుల భర్తీలో సుమారు 400కు పైగా స్పోర్ట్స్ కోటా పోస్టులు ఉన్నాయని అంబటి తెలిపారు. శాప్ ద్వారా జారీ చేసిన కొన్ని క్రీడా ధ్రువపత్రాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, బోగస్, డూప్లికేట్ సర్టిఫికెట్ల ఆరోపణలపై సమగ్ర విచారణ అవసరమని అన్నారు. అందుకే డీఎస్సీ స్పోర్ట్స్ కోటా వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కోరుతున్నామని స్పష్టం చేశారు. అధికారం శాశ్వతం కాదని, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో సగం కాలం పూర్తయిందని అంబటి వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ప్రభుత్వం మారితే చట్టప్రకారం చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని చంద్రబాబు, లోకేశ్‌ను ఉద్దేశించి హెచ్చరించారు. శాంతిభద్రతల వ్యవహారాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించవద్దని సూచించారు. ఎన్ని కేసులు, అరెస్టులు జరిగినా డీఎస్సీ బాధితుల తరపున తమ పోరాటం కొనసాగుతుందని అంబటి స్పష్టం చేశారు.

# ఇరగ్గొట్టినా పాపం లేదు

- డీఎస్సీ వివాదంపై అచ్చెన్న ఫైర్
- వైసీపీ ఆరోపణలపై మంత్రి ఎదురుదాడి



డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్‌సీపీ చేస్తున్న ఆరోపణలను మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. రాజకీయ పార్టీ ముసుగులో క్రిమినల్ రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. విజయవాడలో ఉపాధ్యాయులపై జరిగిన దాడి ఘటనను దారుణంగా అభివర్ణించిన మంత్రి.. నిరసనలో కొందరు వైసీపీకి చెందిన వ్యక్తులు పాల్గొన్నారని, గతంలో భూదోపిడీ, మైనింగ్ కేసుల్లో ఉన్నవారు కూడా అక్కడ కనిపించారని ఆరోపించారు. డీఎస్సీ నియామకాలను నిబంధనల ప్రకారం, పద్ధతి ప్రకారమే చేపట్టామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. జగన్ డీఎస్సీ గురించి మాట్లాడే అర్హతపై ప్రశ్నలు సంధించారు. లోకేశ్‌కు కేంద్రస్థాయిలో గుర్తింపు పెరగడాన్ని తట్టుకోలేకే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. సోమవారం జరిగిన ఘటనలో బాధ్యులను ఇరగ్గొట్టినా పాపం లేదన్న ఆయన.. వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామన్నారు.



# వైఎస్ జగన్‌ను మళ్లీ కలుస్తా

- పెళ్లి ఆహ్వానంపై షర్మిల క్లారిటీ
- రాజకీయాలకు ముడిపెట్టొద్దన్న హితవు

తన కుమార్తె వివాహాన్ని రాజకీయాలతో ముడిపెట్టొద్దని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. తన కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి వివాహానికి అన్ని రాజకీయ పార్టీల అధినేతలను ఆహ్వానిస్తానని తెలిపారు. తన కుమారుడు రాజారెడ్డి వివాహ సమయంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశానని, ఇప్పుడు కుమార్తె వివాహానికి కూడా జగన్‌ను కలిసి ఆహ్వానిస్తానని షర్మిల వెల్లడించారు. రాజకీయ పార్టీల నేతలను వివాహానికి పిలవడం సాధారణ విషయమేనని, దీనికి రాజకీయ ఉద్దేశాలు ఆపాదించడం సరికాదని పేర్కొన్నారు. తెలుగు ప్రజలు తన కుమార్తె అంజిలి రెడ్డి, సోమాల రఘురామ్ రెడ్డి దంపతులను ఆశీర్వదించాలని ఆమె కోరారు.

**తప్పుడు ప్రచారంపై షర్మిల హెచ్చరిక**

తన రాజకీయ భవిష్యత్తు, ఇతర పార్టీల్లో చేరికపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని షర్మిల ఖండించారు. తనపై వస్తున్న వార్తలు నిరాధారమైనవని స్పష్టం చేశారు. కుమార్తె వివాహాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకునే ఉద్దేశం తనకు లేదని తేల్చిచెప్పారు. పెళ్లి పేరుతో రాజకీయ పావులు కదిపే అవసరం తనకు లేదని, వైఎస్సార్ కుమార్తెగా తన రాజకీయ స్థానం గురించి ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదని అన్నారు. తనపై బురదజల్లే ప్రయత్నాలు చేసి ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని దెబ్బతీయాలని చూసే వారిని ఉపేక్షించబోనని హెచ్చరించారు. వివాహ ఆహ్వానాన్ని రాజకీయ పరిణామంగా చూడకుండా, కుటుంబ వేడుకగానే చూడాలని షర్మిల స్పష్టం చేశారు.

## టీచర్లపై దాడి

# వైసీపీపై నిమ్మల ఫైర్




విజయవాడలో ఉపాధ్యాయులపై వైఎస్సార్‌సీపీకి అనుబంధంగా ఉన్నవారు దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రంగా స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం పాలకొల్లులో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. కష్టపడి డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులపై దాడులు చేయడం దారుణమని అన్నారు. ప్రకాశం, గుంటూరు ప్రాంతాల నుంచి కొందరిని విజయవాడకు తీసుకొచ్చి దాడులకు పాల్పడ్డారన్న ఆరోపణలు చేశారు. మాజీ సైనికుడు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వ్యక్తిని సైతం వేధించడం బాధాకరమన్నారు.

**మెరిట్ అభ్యర్థులను 'ఫేక్' అనొద్దు**

క్రీడా ప్రతిభ ఆధారంగా నిబంధనల ప్రకారం డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వారిని 'ఫేక్' అంటూ ముద్ర వేయడం అన్యాయమని నిమ్మల రామానాయుడు అన్నారు. మెగా డీఎస్సీపై మాజీ సీఎం వైఎస్ జగన్ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ అధికార ప్రతినిధి సుంకర పవని కూడా ఉపాధ్యాయులపై దాడిని అమానవీయ చర్యగా అభివర్ణించారు. మెరిట్ ద్వారా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను అనుమానాస్పదంగా చూపించడం వల్ల వారు మానసిక వేదనకు గురయ్యారని తెలిపారు. ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను అడ్డుకోవాలని పవని డిమాండ్ చేశారు.

# క్యాన్సర్‌ను గుర్తించి ఆరోగ్యం కాపాడుకుందాం



ప్రొద్దుటూరులో క్యాన్సర్ ను ప్రారంభ దశలోనే గుర్తించి మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించనున్నారు. ఈ నెల 27న ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రోటరీ ఐ హాస్పిటల్ లో కిమ్స్ సవేరా హాస్పిటల్ వైద్య నిపుణులతో శిబిరం జరగనుంది. రోటరీ క్లబ్ ప్రొద్దుటూరు అధ్యక్షుడు కొవ్వూరు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో, రోటరీ ఐ హాస్పిటల్ అధ్యక్షుడు ఎం.వి.ఎన్. ప్రభు సహకారంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం కరపత్రాలను విడుదల చేశారు. పరీక్షలు చేయించుకోవాలనుకునే వారు ముందుగా రోటరీ ఐ హాస్పిటల్ లో లేదా కరపత్రంలో ఉన్న ఫోన్ నంబర్ కు సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ప్రజలు ఈ ఉచిత వైద్య అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి గండ్లూరు శ్రీధర్ శర్మ, రోటరీ ఐ హాస్పిటల్ కార్యదర్శి బేపారి జాకీర్ అహ్మద్, మాజీ అధ్యక్షులు గుర్రం రామకృష్ణ, తిరుమల బాల సూర్యరావు, ఉపాధ్యక్షుడు కె.రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెన్నా కాలుష్యంపై బీజేపీ పోరుబాట



పెన్నా నదిలో చెత్త, వ్యర్థాలు, జంతువుల కళేబరాలు పడేయడంతో నీరు కలుషితమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ అర్బన్-2 నాయకులు ఆరోపించారు. నది పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న ఉదయం 9 గంటలకు ప్రొద్దుటూరులోని వాసవి సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు అర్బన్-2 అధ్యక్షుడు పాలెం రెడ్డి కిరణ్ తెలిపారు. కాలుష్య సమస్యపై ఇప్పటికే సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో పాటు, పత్రికా ప్రకటనల ద్వారా సమస్యను వెల్లడించినా స్పందన రాకపోవడంతో ఆందోళనకు దిగుతున్నట్లు చెప్పారు. పెన్నా నది పరిరక్షణ కోసం నిర్వహించే ధర్నాకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, పర్యావరణ పరిరక్షణ కోరుకునే వారు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్నా సన్నాహక సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి పర్లపాడు గౌరీశంకర్, జిల్లా కార్యదర్శులు జయలక్ష్మి, చిరంజీవిరెడ్డి, దేవరశెట్టి విక్రాంత్, మురళి, ఎస్సీ మోర్చా నాయకులు పాల్, శ్యామ్, బీజేవైఎం అధ్యక్షుడు అభినయ్, కుమారి, అఖిల, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పులివెందుల అభివృద్ధిపై వైసీపీ విమర్శలు



పులివెందుల అభివృద్ధి, మున్సిపాలిటీకి నిధుల కేటాయింపుపై కూటమి ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద చేపట్టనున్న పనులతో మున్సిపాలిటీకి కలిగే ప్రయోజనాలు, ప్రైవేట్ సంస్థల పెట్టుబడులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విధానాన్ని ఎన్నికల ప్రచారానికి ఉపయోగిస్తున్నారనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో కొనసాగుతున్న పులివెందుల వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టును గత ప్రభుత్వం తీసుకొచ్చిందని, పూర్తయిన పనులకు ప్రస్తుత ప్రభుత్వం క్రెడిట్ తీసుకుంటోందని ఆరోపించారు. వైఎస్ కుటుంబ హయాంలోనే పట్టణ అభివృద్ధి జరిగిందని, గత రెండున్నరేళ్లుగా పులివెందులపై నిర్లక్ష్యం చూపుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎంపీ నిధులతో పనులు చేపడుతున్నారని తెలిపారు. మెడికల్ కళాశాల సీట్ల నిర్ణయంపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు. నిధులు ఇవ్వకుండా ఇప్పుడు రూ.20 కోట్లు కేటాయిస్తామని చెప్పడంపై ప్రజల్లో సందేహాలున్నాయని పేర్కొన్నారు. పులివెందులలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్ కుటుంబానికి ప్రజల మద్దతు ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, నూరుల్లా, షబ్బీర్, బాబావలి, సుదర్శన్, భాషా తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా అభివృద్ధిపై మంత్రుల సమీక్ష



ంగా పూర్తి
చి వచ్చే
వి మెరుగైన
ంచించారు.
ంద్ బాబు,
ు, బాపట్ల
ప్ప బి. ఉమా
), పోతుల
లు, వివిధ
.

# ఎరువుల డీలర్లకు డీఏఈఎస్ఐ శిక్షణ



మహబూబాబాద్, సెప్టెంబర్ 19 (రాజ్య సంస్కరణ ప్రతినిధి): డీఏఈఎస్ఐ (డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్) శిక్షణ తరగతిని మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌చంద్ర శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఏఈఎస్ఐ కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు. ఎరువుల డీలర్లు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఏఓ తిరుపతిరెడ్డి, డీఈఎస్ఐ కార్యక్రమం ప్రెసిడెంట్ రాంచందర్‌రావు, కేవీకే మల్యాల డాక్టర్ సుహాసిని పాల్గొన్నారు. డీఏఈఎస్ఐ శిక్షణ పొందుతున్న ఎరువుల డీలర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 34.83 కోట్లతో చీరాల రూపురేఖలు మార్పు



చీరాల పట్టణాన్ని ఆధునికంగా తీర్చిదిద్దేందుకు రూ.34.83 కోట్ల అభివృద్ధి నిధులతో కీలక పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. చీరాల పురపాలక సంఘ పరిధిలో మంగళవారం రూ.30 కోట్ల హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో 15 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 1.26 కిలోమీటర్ల సెంట్రల్ డివైడర్లు, 8.26 కిలోమీటర్ల వీధి దీపాలు, రెండు నమూనా పార్కుల అభివృద్ధి ఉన్నాయి. పట్టణంలో అమృత్ 2.0, స్వచ్ఛ భారత్ 2.0, యూఐడీఎఫ్ మూడో దశ కింద మరో రూ.140.42 కోట్ల పనులు ప్రతిపాదనలో ఉన్నాయని ఎమ్మెల్యే వివరించారు. వాటితో తాగునీటి సరఫరా, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, రహదారుల అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. రాబోయే రోజుల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పార్కు, చేనేత పార్కు, అత్యవసర చికిత్స విభాగం, రహదారి పైవంతెన నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు

. పనులు నిర్ణీత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులే ప్రధాన ప్రాధాన్యాలని, పట్టణ ముఖచిత్రాన్ని మార్చేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, చీరాల ఆర్డీవో నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ జోసెఫ్ డేనియల్, కూటమి నేతలు పాల్గొన్నారు.

# 220 ఏళ్ల జైలు శిక్ష



## ఈస్టర్ బాంబు పేలుళ్ల కేసు శ్రీలంక కోర్టు సంచలన తీర్పు

శ్రీలంకలో 2019 ఈస్టర్ ఆదివారం జరిగిన భయానక బాంబు పేలుళ్ల కేసులో కీలక తీర్పు వెలువడింది. 15 మంది నిందితులకు ఒక్కొక్కరికి 220 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన హైకోర్టు ధర్మాసనం తీర్పు చెప్పింది. 2019 ఏప్రిల్ 21న మూడు చర్చిలు, మూడు విలాసవంతమైన హోటళ్లను లక్ష్యంగా చేసుకుని జరిగిన వరుస ఆత్మాహుతి దాడుల్లో 279 మంది ప్రాణాలు కోల్పోయారు. 14 మంది హత్య, ఉగ్రవాద కుట్ర, పేలుడు పదార్థాలు, ఆయుధాల అక్రమ స్వాధీనం వంటి అన్ని అభియోగాల్లో దోషులుగా తేలారు. మరో నిందితుడు కొన్ని అభియోగాల్లో మాత్రమే దోషిగా తేలినా అతనికీ 220 ఏళ్ల శిక్ష పడింది. మరో 9 మందిని కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.ఆస్తుల స్వాధీనం.. బాధితులకు న్యాయందోషుల ఆస్తులు, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసులో మొత్తం 23,270 అభియోగాలు నమోదు కావడం శ్రీలంక న్యాయ చరిత్రలోనే రికార్డుగా నిలిచింది. దాడులకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న నిందితులందరూ శ్రీలంక మైనారిటీ ముస్లిం వర్గానికి చెందిన వారు. తొలుత 25 మందిపై కేసులు నమోదయ్యాయి. విచారణ సమయంలో ఒకరు మరణించారు. దోషుల్లో మహ్మద్ నౌఫర్‌ను దాడులకు పాల్పడిన ఎనిమిది మంది ఆత్మాహుతి బాంబర్లకు సహకరించిన ప్రధాన నిర్వాహకుడిగా ప్రాసిక్యూషన్ పేర్కొంది. తీర్పుపై శ్రీలంక కాథలిక్ చర్చి హర్షం వ్యక్తం చేసింది. "చివరకు న్యాయం జరిగింది" అని ఫాదర్ జూడ్ ఫెర్నాండో వ్యాఖ్యానించారు.కుట్ర ఆరోపణలపై కొనసాగుతున్న దర్యాప్తుఈ దాడుల్లో 45 మంది విదేశీయులు కూడా మరణించారు. ఆస్ట్రేలియా, భారత్, బ్రిటన్, చైనా, జపాన్, అమెరికా సహా పలు దేశాల పౌరులు బాధితుల్లో ఉన్నారు. దాడులను స్థానిక ఇస్లామిక్ తీవ్రవాద సంస్థకు చెందిన నెట్‌వర్క్ నిర్వహించినట్లు దర్యాప్తు సంస్థలు ఆరోపించాయి. ఇదే సమయంలో శ్రీలంక మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ సురేష్ సల్లేపై దాడుల వెనుక కుట్రలో పాత్ర ఉందన్న ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతోంది. ఆయన ఆరోపణలను ఖండిస్తున్నారు. దాడులకు ముందు భద్రతా హెచ్చరికలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోలేదన్న కేసులో మాజీ పోలీస్ చీఫ్, మాజీ భద్రతాధికారి జూలైలో మరణశిక్షకు గురయ్యారు. అయితే 1976 తర్వాత శ్రీలంకలో మరణశిక్ష అమలు కాలేదు. రాష్ట్రంలోని కొందరికి దాడులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలను రాజపక్స కుటుంబం తిరస్కరిస్తోంది.

# డ్రైన్ల ఆక్రమణలపై మున్సిపల్ కొరడా



ప్రొద్దుటూరులో డ్రైన్ల ఆక్రమణలు, అక్రమ కట్టడాలు, బంకుల తొలగింపునకు మున్సిపల్ అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకులుగా మారుతున్న ఆక్రమణలను గుర్తించి దశలవారీగా తొలగించే ప్రణాళిక సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఇటీవల వర్షాలతో పలు ప్రాంతాల్లో నీరు నిలిచిన నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే సిబ్బందితో కలిసి ఆయన పట్టణంలో పర్యటించి డ్రైన్ల పరిస్థితిని పరిశీలించారు. పలు చోట్ల ఆక్రమణలతో పాటు ప్లాస్టిక్, చెత్త పేరుకుపోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోతున్నట్లు గుర్తించారు. వెంటనే సిల్ట్ తొలగింపు పనులు చేపట్టారు. డ్రైన్లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినవారు, బంకులు ఏర్పాటు చేసినవారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కమిషనర్ సూచించారు. లేనిపక్షంలో మున్సిపల్ నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధాన డ్రైన్లు, వర్షపు నీటి మార్గాల్లోని ఆక్రమణలను తీవ్రత ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో తొలగించాలని ఆదేశించారు. డ్రైన్లలో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని, పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలని సూచించారు. ఆక్రమణలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

# తాగునీటికి శాశ్వత పరిష్కారం



పులివెందుల ప్రాంత ప్రజలకు నిరంతరాయంగా, సురక్షితమైన తాగు నీరు అందించేందుకు చేపడుతున్న భారీ పథకం పనులు వేగం పుంజుకోనున్నాయి. రూ.480 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న తాగునీటి సరఫరా పథకం పనుల పురోగతిని టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి పరిశీలించారు. కడప జిల్లా కలెక్టర్ డా. చెరుకూరి శ్రీధర్‌తో కలిసి లింగాల మండలం పార్నపల్లి గ్రామం వద్ద జరుగుతున్న పనులను సమీక్షించారు. పథకం కింద మిగిలిన పనులను మరింత వేగవంతం చేసి, జల్ జీవన్ పథకం ప్రారంభానికి ముందే నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల్లో ఎక్కడైనా జాప్యం ఉంటే వెంటనే గుర్తించి పరిష్కరించాలని కోరారు. ప్రాజెక్టు పూర్తయితే పులివెందుల ప్రాంతంలోని ప్రజలకు తాగునీటి సరఫరాలో గణనీయమైన మెరుగుదల వచ్చే అవకాశం ఉందని బీటెక్ రవి తెలిపారు. ప్రస్తుతం ఎదురవుతున్న నీటి ఇబ్బందులకు దీర్ఘకాలిక పరిష్కారం చూపడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రజలకు ప్రతి రోజూ సురక్షితమైన తాగునీరు అందేలా పథకాన్ని వేగంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు.

# పులివెందుల అభివృద్ధికి భారీ ఊతం



పులివెందుల పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, సెంట్రల్ మీడియన్లు, స్ట్రీట్ లైటింగ్, పార్కుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. కుప్పం నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే అభివృద్ధి పనులకు వర్చువల్ గా శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్ చార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి), జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఆర్డీవో చిన్నయ్య, మున్సిపల్ కమిషనర్ తనుజ పాల్గొన్నారు. పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనులను వేగంగా పూర్తి చేయాలని బీటెక్ రవి అన్నారు. అభివృద్ధి పనుల అమలులో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు. రహదారుల మెరుగుదలతో పాటు డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం, వెలుగులు, పచ్చదనం పెంపు ద్వారా పులివెందుల పట్టణ రూపురేఖలను మార్చేందుకు కృషి చేస్తామని చెప్పారు.

# ప్రజాసేవలో చెరగని ముద్ర..

## నాయకత్వంలో విశిష్ట ప్రస్థానం



వేంపల్లె మండలం గిడ్డంగివారిపల్లికి చెందిన మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి ప్రజాసేవలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ తనదైన ముద్ర వేశారని ఆల్ ఇండియా బంజార సేవా సంఘం సంయుక్త కార్యదర్శి బుక్కె రమేష్ నాయక్ తెలిపారు. జడ్పీటీసీ సభ్యునిగా రెండు పర్యాయాలు, మండల అధ్యక్షుడిగా, సర్పంచ్‌గా, పార్టీ మండల ఇన్‌చార్జిగా సేవలందించిన ఆయన పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా అభినందనలు తెలిపారు. వైఎస్సార్ కుటుంబం పట్ల విధేయతతో పాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేశారని పేర్కొన్నారు. వేంపల్లెలో ప్రభుత్వ పాఠశాలలు, డిగ్రీ కళాశాల, ఇండోర్ స్టేడియం, ఉర్దూ జూనియర్ కళాశాల, వైఎస్సార్ మెమోరియల్ పార్క్, ఆర్టీసీ బస్టాండ్, అగ్నిమాపక కేంద్రం, రహదారి విస్తరణ, ఆర్అండ్‌బీ అతిథి గృహం, రైతుబజార్, బీసీ హాస్టల్, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల ఆధునీకరణకు కృషి చేశారని తెలిపారు. పేద విద్యార్థులకు డిప్లొమా, ట్రిపుల్ఐటీ విద్యావకాశాల్లో సహకరించారని చెప్పారు. పదవులు తాత్కాలికమైనా సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షించారు.

## ట్రిపుల్ ఐటీ ఉద్యోగుల సమస్యలపై సీఐటీయూ పోరాటం



ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. 2022-23 సంవత్సరానికి సంబంధించిన పీఆర్సీ బకాయిలను తక్షణమే మంజూరు చేసి చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్ కోరారు. మంగళవారం ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ విజయ్ ప్రకాష్‌ను కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించి వినతిపత్రం అందజేశారు. పీఆర్సీ బకాయిల చెల్లింపుతో పాటు ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న ఉద్యోగులందరికీ మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఆఫీస్ బాయ్స్, సెక్యూరిటీ సిబ్బంది, శానిటేషన్, హౌస్‌కీపింగ్, ల్యాబ్ అటెండర్లు, ప్లంబర్లు, గార్డియన్లు, ల్యాబ్ అసిస్టెంట్లు, అటెండర్లతో పాటు ఇతర విభాగాల సిబ్బందికి కూడా ఈ ప్రయోజనం కల్పించాలని కోరారు. ఉద్యోగుల వేతనాలు, పీఆర్సీ, మినిమం టైమ్ స్కేల్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారం చూపాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఉద్యోగుల విజ్ఞప్తిపై డైరెక్టర్ విజయ్ ప్రకాష్ సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

# రూ. 10 వేల కోసం....
# రూ.24 కోట్ల బూడిద!

## చిన్న బకాయి పెద్ద ప్రతీకారం



గుజరాత్ లోని సూరత్ టెక్స్ టైల్ మార్కెట్ లో జరిగిన భారీ అగ్నిప్రమాదం ప్రమాదం కాదని పోలీసులు తేల్చారు. తనకు రావాల్సిన రూ.10 వేల జీతం కోసం మాజీ యజమానిపై కోపంతో అకౌంటెంట్ వినోద్ పండిట్ సావ్లే ఈ దారుణానికి పాల్పడినట్లు క్రైమ్ బ్రాంచ్ వెల్లడించింది. సెప్టెంబర్ 89 అర్ధరాత్రి శ్యామ్ సంగిని టెక్స్ టైల్ మార్కెట్ లోని ఓ దుకాణం బయట ఉన్న వస్త్రాల పార్సిళ్లపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు పోలీసులు తెలిపారు. కేవలం రూ.150 విలువైన పెట్రోల్, రెండు అగ్గిపుల్లలతో మొదలైన మంటలు వేగంగా వ్యాపించాయి. మొత్తం 14 దుకాణాలకు మంటలు వ్యాపించడంతో సుమారు రూ.24 కోట్ల విలువైన వస్త్రాలు దగ్ధమయ్యాయి.మూడు నెలల ఉద్యోగం.. మనసులో పగవినోద్ ఏప్రిల్ 2026లో షాప్ నంబర్ 639లో అకౌంటెంట్ గా చేరాడు. ఖాతాల పని సరిగ్గా నిర్వహించలేకపోవడంతో జూన్ లో ఉద్యోగం మానేశాడు. తన మాజీ యజమాని రూ.10 వేలు ఇవ్వాల్సి ఉందని భావించిన అతడు.. యజమానికి గుణపాఠం చెప్పాలనే ఉద్దేశంతో నిప్పంటించినట్లు పోలీసులు చెప్పారు. సెప్టెంబర్ 8 రాత్రి సుమారు 9 గంటలకు మార్కెట్ లోకి వెళ్లి ఐదో అంతస్తు మెట్ల సమీపంలో దాక్కున్నాడు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఎవరూ లేని సమయంలో ఆరో అంతస్తుకు చేరుకుని, దుకాణం బయట ఉన్న వస్త్రాల పెట్టెలపై పెట్రోల్ పోశాడు. ముఖానికి తెల్లటి గుడ్డ కప్పుకున్న అతడు మొదట అగ్గిపుల్లతో నిప్పంటించేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. రెండోసారి మంటలు అంటుకోవడంతో అక్కడి నుంచి పారిపోయే ముందు వెనక్కి తిరిగి మంటలను పరిశీలించినట్లు సీసీటీవీలో కనిపించింది.సీసీటీవీతో చిక్కిన నిందితుడుమార్కెట్ లో మంటలు అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బందికి గంటల సమయం పట్టింది. తొలుత ఇది ప్రమాదంగా భావించిన పోలీసులు గుర్తుతెలియని వ్యక్తిపై కేసు నమోదు చేశారు. తర్వాత 'విశ్వాస్ ప్రాజెక్ట్ ఫేజ్ 2' సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి నిందితుడి కదలికలను మార్కెట్ ప్రవేశం నుంచి బయటకు వెళ్లే వరకు అనుసంధానించారు. దర్యాప్తులో దిండోలిలోని బిలీపత్ర రెసిడెన్సీకి చెందిన వినోద్ సావ్లే అని గుర్తించారు. కేసు విషయం తెలిసిన వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి భార్య, బిడ్డతో సూరత్ నుంచి వెళ్లిపోయి తొలుత రాజస్థాన్ లోని ఖాటూ శ్యామ్ ఆలయానికి, అక్కడి నుంచి అయోధ్యకు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. తిరిగి సూరత్ కు వచ్చిన సమయంలో దిండోలిలోని ఫ్లవర్ గార్డెన్ సమీపంలో క్రైమ్ బ్రాంచ్ అతడిని అరెస్ట్ చేసింది. పెట్రోల్ విక్రయంలో నిబంధనలు పాటించారా? ఈ ఘటనలో మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోంది.

రాజ్య సంస్కరణ





# ముసుగులో గుద్దులాట..

# స్పోర్ట్స్ కోటాలో పాకులాట..

- ◆ గురువుల ఎంపిక గూడుపుఠాని..
- ◆ నిజమెక్కడ.. అబద్ధమెక్కడ?
- ◆ ఇంకెంతకాలం... ఈ రాజకీయ సయ్యాట

డీఎస్సీ.. లక్షలాది నిరుద్యోగుల ఆశలకు పరీక్ష. వేల కుటుంబాల భవిష్యత్తుకు భరోసా. అలాంటి మెగా నియామకంలో స్పోర్ట్స్ కోటా ఇప్పుడు రాజకీయ రణరంగంగా మారింది. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో 3 శాతం స్పోర్ట్స్ కోటా కింద జరిగిన నియామకాలే ఇంతటి దుమారానికి కారణమయ్యాయి. ప్రభుత్వం చెబుతున్నది ఒక్కటే... నియామకాలు నిబంధనల ప్రకారమే జరిగాయి. ప్రతిపక్షం ప్రశ్నిస్తున్నది మాత్రం మరింత పదునుగా... రాతపరీక్ష లేకుండా ఉద్యోగాలు ఎలా? జీఓలు ఎందుకు మారాయి? సర్టిఫికెట్ల నిజానిజాలు ఏమిటి? 431 పోస్టులకు 382 ఎంపికలు, రాజకీయ ఆరోపణల్లో 372 మంది అంటూ వినిపిస్తున్న సంఖ్యలు అసలు ఏ కథ చెబుతున్నాయి? జూడో నుంచి సాఫ్ట్‌బాల్ వరకు సర్టిఫికెట్లపై అనుమానాలు.. టెట్ అర్హతలపై ప్రశ్నలు.. విజిలెన్స్ పరిశీలనలు.. కోర్టు వివాదాలు.. రోడ్డెక్కిన నిరసనలు.. ఎదురెదురుగా నిలిచిన వర్గాలు.. ఇప్పుడు వ్యవహారం రాజకీయ ఆరోపణల దశ దాటి ప్రభుత్వ పారదర్శకతకు పరీక్షగా మారింది. ఆరోపణ నిజమా? ప్రభుత్వ వివరణే పూర్తి సత్యమా? లేక ఫైళ్లలో దాగి ఉన్న మరో వాస్తవం ఉందా? ఆ 372 పేర్ల వెనుక అసలు కథేంటి?



### • డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై పెరుగుతున్న సందేహాలు

ఉద్యోగం అంటే నిరుద్యోగ యువతకు అది కేవలం ఒక పోస్టు కాదు. జీవితానికి ఒక భరోసా. కుటుంబానికి ఒక ఆధారం. అందుకే ప్రభుత్వ ఉద్యోగ నియామకంలో చిన్న అనుమానం వచ్చినా అది పెద్ద వివాదంగా మారుతుంది. ఆ అనుమానానికి రాజకీయ రంగు పులిమితే మరింత ముదురుతుంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా వ్యవహారం అదే దశకు చేరింది. 16,347 ఉపాధ్యాయ పోస్టులతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా డీఎస్సీ ప్రక్రియలో స్పోర్ట్స్ కోటా నియామకాలు మాత్రం నెలలుగా రాజకీయ దుమారానికి కేంద్రబిందువయ్యాయి. ప్రభుత్వం నియామకాలు నిబంధనల ప్రకారమే జరిగాయని చెబుతోంది. విద్యాశాఖ అధికారులు కూడా అర్హతలు, సర్టిఫికెట్ల పరిశీలన, రిక్రూట్‌మెంట్ నిబంధనల ఆధారంగానే ఎంపిక జరిగిందని వివరిస్తున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ మాత్రం ఇది సాధారణ నియామకం కాదని, ప్రభుత్వ ఉత్తర్వులు మార్చడం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన వరకు అనేక ప్రశ్నలు ఉన్నాయని ఆరోపిస్తోంది. మరి నిజం ఏది? ఆరోపణలే నిజమా? ప్రభుత్వ వివరణే పూర్తి సత్యమా? లేక ఈ రెండింటి మధ్య ఇంకా బయటకు రావాల్సిన వాస్తవాలున్నాయా?

మెగా డీఎస్సీ2025కు సంబంధించి మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం స్పోర్ట్స్ కోటాకు 3 శాతం కింద 431 పోస్టులు కేటాయించబడ్డాయి. జూన్‌లో ప్రభుత్వం తరపున స్పోర్ట్స్ కోటాలో 382 మంది ఎంపికయ్యారని కూడా వెల్లడైంది. అయితే రాజకీయ ఆరోపణల్లో మాత్రం 372 మంది అనే సంఖ్యే ప్రధానంగా వినిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన ఆరోపణల్లో 372 మందికి డీఎస్సీ రాతపరీక్ష రాయకుండానే స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. అంటే ఇక్కడ మొదటి ప్రశ్నే సంఖ్యపై వస్తోంది.

### • జీఓల మార్పుతో మొదలైన డీఎస్సీ వివాదం

అసలు వివాదానికి మూలం ఎక్కడుంది? స్పోర్ట్స్ కోటా నియామకాల్లో సాధారణ డీఎస్సీ రాతపరీక్షకు బదులుగా క్రీడా ప్రతిభ, సర్టిఫికెట్లు, నిర్దేశిత అర్హతల ఆధారంగా ఎంపిక జరిగే విధానం చుట్టూ ప్రధాన ప్రశ్నలు తలెత్తాయి. వైఎస్సార్‌సీపీ వాదన ఏమిటంటే.. ప్రభుత్వం జీఓ నంబర్ 4, జీఓ నంబర్ 47 ద్వారా స్పోర్ట్స్ కోటా నిబంధనల్లో మార్పులు చేసి కొంత మందికి రాతపరీక్ష లేకుండానే నియామకానికి మార్గం కల్పించిందని. ఆ తర్వాత మరో దశలో జీఓలు మార్చడం ఎందుకు జరిగిందని జగన్ ప్రశ్నించారు. ఈ ఉత్తర్వులు ఎప్పుడు జారీ అయ్యాయి? డీఎస్సీ నోటిఫికేషన్‌కు వాటి సంబంధం ఏమిటి? గతంలో ఉన్న నిబంధనతో పోలిస్తే కొత్త నిబంధనలో ఏ మార్పు వచ్చింది? ఆ మార్పు వల్ల ఎంతమంది అభ్యర్థులకు ప్రయోజనం కలిగింది? ఈ ప్రశ్నలకు సమగ్రంగా సమాధానం ఇవ్వకుండా కేవలం 'అంతా నిబంధనల ప్రకారమే జరిగింది' అనడం రాజకీయ వివాదాన్ని ముగించదు. ఇదే సమయంలో ప్రభుత్వం చెబుతున్న వాదనను కూడా విస్మరించలేం. విద్యాశాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధికారులు స్పోర్ట్స్ కోటా ఎంపికల్లో అర్హతలను పరిశీలించామని, అభ్యర్థుల సర్టిఫికెట్లను సంబంధిత సంస్థల నుంచి ధ్రువీకరించామని, ఎంపిక ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగానే జరిగిందని స్పష్టం చేశారు. సెప్టెంబర్‌లో విద్యాశాఖ కమిషనర్ ఏ. తమీమ్ అన్సారియా, శాప్ ఎండీ డి.ఎస్. భరణి తదితరులు అధికారిక వివరణ ఇచ్చారు. ప్రభుత్వ వాదన ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతి అభ్యర్థి అర్హతను రికార్డుల ఆధారంగా పరిశీలించవచ్చని... కొన్ని సర్టిఫికెట్లపై వివాదం ఉంటే వాటిని కూడా విచారిస్తున్నామని చెప్పారు. అంటే ప్రభుత్వం వైపు నుంచి 'నియామక ప్రక్రియ మొత్తం అక్రమం' అన్న ఆరోపణను అంగీకరించే పరిస్థితి లేదు.

### • సర్టిఫికెట్లపై అనుమానాలు.. టెట్ అర్హతలపై ప్రశ్నలు

అయితే అసలు మలుపు సర్టిఫికెట్ల దగ్గరే మొదలైంది. జూడో, సాఫ్ట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, ఫెన్సింగ్ వంటి వివిధ క్రీడలకు సంబంధించిన సర్టిఫికెట్లపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో దాఖలైన ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యంలో కనీసం 29 సందర్భాల్లో తప్పుడు క్లెయిమ్‌లు లేదా నకిలీ సర్టిఫికెట్లకు సంబంధించిన ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని పిటిషన్‌లో పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడించాయి. మరోవైపు జూడో సర్టిఫికెట్లపై విజిలెన్స్ పరిశీలన కూడా ప్రారంభమైనట్లు సమాచారం వెలువడింది. ఇక్కడ ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. పిటిషన్‌లో ఆరోపణలు ఉండటం, దర్యాప్తు ప్రారంభం కావడం ఒక విషయం... ఆరోపణలు న్యాయపరంగా రుజువై అక్రమ నియామకాలు జరిగాయని తేలడం మరో విషయం. అందుకే ప్రతి అభ్యర్థి సర్టిఫికెట్‌ను సంబంధిత క్రీడా సంస్థల నుంచి మళ్లీ ధ్రువీకరించడం అత్యంత కీలకం. ఇక టెట్ అర్హతల అంశం మరో చిచ్చు పెట్టింది. కొందరు అభ్యర్థులు నిర్దేశిత టెట్ అర్హత లేకుండానే ఉద్యోగాలు పొందారని వైఎస్సార్‌సీపీ ఆరోపిస్తోంది. కర్నూలు, చిత్తూరు, తూర్పుగోదావరి జిల్లాలకు సంబంధించిన కొన్ని ఉదాహరణలను ప్రతిపక్ష నేతలు ప్రస్తావించారు. అయితే విద్యాశాఖ మాత్రం పోస్టును బట్టి టెట్ నిబంధనలు, ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులకు వర్తించే అర్హతలు వేర్వేరుగా ఉంటాయని వివరణ ఇచ్చింది. టెట్‌కు సంబంధించిన కనీస అర్హతలు, టెట్ స్కోర్‌కు ఉన్న వెయిటేజ్, డీఎస్సీ రాతపరీక్షకు ఉన్న వెయిటేజ్ వంటి అంశాలను అధికారులు వివరించారు. అందువల్ల ఒక్కో అభ్యర్థి పోస్టు, కేటగిరీ, టెట్ అర్హత, డీఎస్సీ నిబంధనల ఆధారంగా పరిశీలించకుండా 'అందరూ అనర్హులే' లేదా 'అందరూ అర్హులే' అని తేల్చడం కూడా సరైన పద్ధతి కాదు.

### • రాజకీయ పోరుగా మారిన డీఎస్సీ వివాదం

కానీ రాజకీయ పోరాటం మాత్రం ఇక్కడితో ఆగలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగస్టు 20న డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ సీబీఐ విచారణకు డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని కూడా కోరారు. ప్రశ్నపత్రం తయారీ, పరీక్ష నిర్వహణ ఒకే సంస్థ పరిధిలో ఉండటంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పురమా నవీన్ వ్యవహారాన్ని కూడా ప్రస్తావించారు. అదే సమయంలో 372 స్పోర్ట్స్ కోటా నియామకాలపై ప్రశ్నలు లేవనెత్తారు. ఆ నియామకాల్లో క్రీడా ప్రతిభకు ఎంత ప్రాధాన్యం ఇచ్చారు? ఎవరు ఏ స్థాయిలో పోటీల్లో పాల్గొన్నారు? ఎవరు పతకాలు సాధించారు? అన్న వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. జగన్ ఆరోపణల్లో మరో రాజకీయ కోణం కూడా ఉంది. క్రీడా కోటా ద్వారా ఉద్యోగాలు పొందిన వారిని అంతర్జాతీయ క్రీడాకారిణి పీవీ సింధుతో పోల్చడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం మాత్రం స్పోర్ట్స్ కోటా అనేది కేవలం అంతర్జాతీయ పతక విజేతలకే పరిమితం కాదని, అమలులో ఉన్న ప్రాధాన్యతా క్రమాలు, క్రీడా ప్రమాణాలు, గుర్తింపు పొందిన పోటీల ఆధారంగా ఎంపిక జరుగుతుందని వివరిస్తోంది. కాబట్టి అసలు తేలాల్సిన ప్రశ్న 'వాళ్లు పీవీ సింధులా?' అనేది కాదు. 'వాళ్లు వర్తించే స్పోర్ట్స్ కోటా నిబంధనల్లోని అర్హతలను నిజంగా సాధించారా?' అనేదే. ఆ ప్రశ్నకు అభ్యర్థి వారీగా సర్టిఫికెట్లు, పోటీ స్థాయి, మెడల్ లేదా పార్టిసిపేషన్ వివరాలు బయటపెడితే సమాధానం దొరుకుతుంది. ఈ వివాదం మరోసారి ప్రభుత్వ పారదర్శకతకు పరీక్షగా మారింది. ప్రభుత్వం 'నిబంధనల ప్రకారమే' అంటోంది. ప్రతిపక్షం 'ఇదిగో ఆధారాలు' అంటోంది. ఇరువైపులా రాజకీయ ఆరోపణలు పెరుగుతున్నాయి.

### • నిరుద్యోగుల ప్రశ్నలతో రోడ్డెక్కిన వివాదం

నిరుద్యోగ యువతకు కావాల్సింది మాత్రం రాజకీయ వాదోపవాదం కాదు. తమకు ఉద్యోగం దక్కిందా? దక్కలేదా? ఎందుకు దక్కలేదు? ఎంపికైన వ్యక్తికి తనకంటే ఎక్కువ అర్హత ఉందా? సర్టిఫికెట్ నిజమా? నిబంధన సరైనదా? అనే స్పష్టత. ఉద్యోగ నియామకంలో చివరకు నిలిచేది ప్రభుత్వ ఉత్తర్వు కాదు.. ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసానికి పారదర్శకతే పునాది. ఇంతలో వివాదం వీధుల్లోకి వచ్చింది. వైఎస్సార్‌సీపీ నిరసనలు చేపట్టింది. ప్రభుత్వం అనుమతి ఇవ్వని నిరసనలకు వెళ్లిన సందర్భాలు, పోలీసులు అడ్డుకున్న ఘటనలు చోటుచేసుకున్నాయి. సెప్టెంబర్ 21న విజయవాడలోని ఎస్‌ఏపీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నిరసన ఉద్రిక్తంగా మారింది. పోలీసులు లాఠీచార్జి చేసి కార్యకర్తలను చెదరగొట్టినట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అదే సమయంలో స్పోర్ట్స్ కోటా ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు కూడా తమ నియామకాలను సమర్థిస్తూ ప్రత్యామ్నాయ నిరసన చేపట్టారు. 'మేము పతకాలు సాధించాం.. మా సర్టిఫికెట్లు నిజమైనవే..' అంటూ వారు తమపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. ఇక్కడే మరో సున్నితమైన అంశం తెరపైకి వచ్చింది. నిరసన ప్రదేశంలో ఇరువర్గాలు ఎదురెదురుగా నిలవడం. వైఎస్సార్‌సీపీ నాయకులు తమ నిరసనకు ఎదురుగా టీడీపీ అనుకూల వర్గాలు చేరాయని ఆరోపించారు. 'ప్రయివేటు గూండాలు' చొరబడ్డారన్న ఆరోపణలు కూడా రాజకీయంగా వినిపించాయి. అయితే ఇలాంటి ఆరోపణలను వాస్తవాలుగా ప్రకటించే ముందు దర్యాప్తు ఆధారాలు అవసరం. ఎవరెవరు అక్కడ ఉన్నారు? వారు ఏ సంస్థకు చెందినవారు? ఎవరిపై దాడి జరిగింది? పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అన్న వివరాలు అధికారికంగా బయటకు రావాలి.

### • రికార్డులు బయటపెడితేనే నిజం తేలుతుంది..!

రాజకీయ పోరాటం పేరుతో నిరసనకారులపై దాడి జరిగినా, నిరసన పేరుతో హింసకు దిగినా ప్రజాస్వామ్యానికి రెండూ అనుకూలం కావు. ఇంతటి వివాదం వచ్చినప్పుడు ప్రభుత్వం చేయాల్సింది ప్రతిపక్షాన్ని తప్పుపట్టడం మాత్రమే కాదు. 'మా మీద ఆరోపణలు నిరూపించండి' అని ఎదురు చూడటం కూడా సరిపోదు. ఎందుకంటే ప్రభుత్వానికి తన చేతిలో ఉన్న రికార్డులు తెలుసు. ఎంపికైన అభ్యర్థుల పూర్తి జాబితా ఉంది. వారి స్పోర్ట్స్ సర్టిఫికెట్లు ఉన్నాయి. ఏ పోటీలో పాల్గొన్నారు? ఏ స్థాయిలో పాల్గొన్నారు? ఏ మెడల్ సాధించారు? ఏ సంఘం సర్టిఫికెట్ ఇచ్చింది? శాప్ దాన్ని ఎలా ధ్రువీకరించింది? టెట్ అర్హత ఏంటి? డీఎస్సీ రాతపరీక్ష ఎందుకు వర్తించలేదు? వర్తించిన నిబంధన ఏ జీఓలో ఉంది? ఆ జీఓ ఎప్పుడు వచ్చింది? ఆ తర్వాత ఎందుకు మారింది? ఇవన్నీ ఒకే చోట పెట్టేస్తే సగం వివాదం అక్కడికక్కడే ముగిసిపోతుంది. అందుకే ప్రభుత్వం నిజంగా పారదర్శకతపై నమ్మకం ఉంటే ఒక బహిరంగ డేటా డిస్క్లోజర్ చేయాలి. అభ్యర్థుల వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన వివరాలు మినహాయించి, 372 మంది లేదా తుది ఎంపికలో ఉన్న సంబంధిత స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల క్రీడా అర్హతల పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఏ క్రీడ? ఏ సంవత్సరం? ఏ పోటీ? ఏ స్థాయి? వ్యక్తిగతమా? జట్టు పోటీయా? ఏ స్థానం? ఏ మెడల్? ఏ సంస్థ సర్టిఫికెట్ ఇచ్చింది? ఆ సంస్థను శాప్ ఎలా ధ్రువీకరించింది? అనే వివరాలను ఒకే పోర్టల్‌లో పెట్టాలి. అప్పుడు ఎవరి ఆరోపణ ఎంతవరకు నిజమో ప్రజలే చూసుకోవచ్చు. అదే సమయంలో ప్రతిపక్షం కూడా బాధ్యత తీసుకోవాలి. 'అక్రమం జరిగింది' అని రాజకీయంగా చెప్పడమే కాకుండా సాక్ష్యాధారాలు ప్రస్తుతం చూపిస్తున్న విధంగా.. జనబాహుళ్యంలో ఉంచాలి. ప్రభుత్వం చెప్పిన ప్రతీ వివరణకు ప్రతివాద ఆధారాలు ఇవ్వాలి. ఆరోపణ చేసినంత మాత్రాన అది నిజం కాదు. కానీ ప్రభుత్వం ఖండించినంత మాత్రాన ఆరోపణ అబద్ధం కూడా కాదు. అందుకే మధ్యలో ఉండాల్సింది డాక్యుమెంట్. అదే ప్రజాస్వామ్యంలో నిజానికి దారి.

### • 372 మందిపై రికార్డులతోనే వివాదానికి ఫుల్‌స్టాప్

ఒకవైపు ఉద్యోగం కోసం సంవత్సరాలుగా చదివిన లక్షలాది మంది అభ్యర్థులు. మరోవైపు క్రీడా ప్రతిభ ఆధారంగా ప్రత్యేక కోటా ద్వారా అవకాశం పొందిన వారు. మధ్యలో ప్రభుత్వం. చుట్టూ రాజకీయ పార్టీలు. పైగా కోర్టులు, దర్యాప్తులు, సర్టిఫికెట్ వివాదాలు. ఇలాంటి సమయంలో ప్రతి మాటకు బరువు ఉంటుంది. ప్రతి జీఓకు అర్థం ఉంటుంది. ప్రతి సర్టిఫికెట్‌కు విలువ ఉంటుంది. ప్రతి నియామకానికి బాధ్యత ఉంటుంది. అందుకే ఇప్పుడు ప్రభుత్వం చేయాల్సింది ఒకటే. ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టాలంటే ఫైల్‌ను తెరవాలి. 372 అనే సంఖ్యను చర్చ నుంచి బయటకు తీసి, అభ్యర్థి వారీగా వాస్తవాలను ప్రజల ముందు పెట్టాలి. స్పోర్ట్స్ సర్టిఫికెట్లను ధ్రువీకరించిన రికార్డులు చూపించాలి. వివాదాస్పద సర్టిఫికెట్లపై జరిగిన విజిలెన్స్ లేదా ఇతర విచారణ స్థితిని వెల్లడించాలి. జీఓ 4, జీఓ 47తో పాటు తదుపరి జీఓల మధ్య ఉన్న సంబంధాన్ని స్పష్టంగా వివరించాలి. డీఎస్సీ రాతపరీక్ష నుంచి స్పోర్ట్స్ కోటా నియామకం వరకు మొత్తం చైన్‌ను ప్రజలకు అర్థమయ్యేలా ఉంచాలి. అప్పుడు మాత్రమే 'నియామకం పారదర్శకంగా జరిగింది' అన్న ప్రభుత్వ మాటకు పూర్తి బలం వస్తుంది. మరి ఆ 372 మందిని ఒకే వేదికపైకి తీసుకురావాలా? తీసుకురావచ్చు. కానీ అది రాజకీయ సభగా కాదు. అధికారిక పారదర్శకత వేదికగా ఉండాలి. వారి క్రీడా అర్హతలు, సర్టిఫికెట్లు, పోటీ స్థాయిలు, ధ్రువీకరణ వివరాలు నిపుణుల సమక్షంలో పరిశీలించాలి. అభ్యర్థులకు కూడా తమ వాదన చెప్పే అవకాశం ఇవ్వాలి. ఆరోపణలు చేసిన ప్రతిపక్షానికి కూడా అదే డేటాను పరిశీలించే అవకాశం ఇవ్వాలి. మీడియాకు కూడా అందుబాటులో ఉంచాలి. అప్పుడు వివాదం 'మీరు చెప్పారు-మేము చెప్పాం' అనే స్థాయి నుంచి 'ఇదిగో రికార్డు' అనే స్థాయికి వస్తుంది.

### • డీఎస్సీ వివాదంలో ప్రభుత్వానికి కీలక పరీక్ష

ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌పై రాజకీయ ఒత్తిడి పెరగడం సహజమే. ఎందుకంటే మెగా డీఎస్సీ అనేది సాధారణ నియామకం కాదు. వేలాది కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడిన భారీ రిక్రూట్‌మెంట్. ప్రభుత్వం దాన్ని పారదర్శకంగా నిర్వహించామని చెబుతున్నప్పుడు, దానిపై వచ్చిన అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. లోకేశ్ ఇప్పటికే నియామక ప్రక్రియను సమర్థిస్తూ ప్రభుత్వం తరపున వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రి స్థాయిలోనూ ప్రభుత్వ వైఖరి స్పష్టమే. అయితే రాజకీయ ప్రకటనలతో కాకుండా అభ్యర్థి వారీగా రికార్డులు బయటపెట్టడం ద్వారా ఆ సమర్థన మరింత బలపడుతుంది. జగన్ వైపు నుంచి సీబీఐ విచారణ డిమాండ్ రావడం రాజకీయంగా తీవ్రతను పెంచింది. సీబీఐ విచారణకు వెళ్లాలా? రాష్ట్రస్థాయి విచారణ సరిపోతుందా? విజిలెన్స్ దర్యాప్తుతో సమస్య పరిష్కారమవుతుందా? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయ పరిధిలో ఉన్నాయి. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. ఇప్పటికే కొన్ని సర్టిఫికెట్లపై పరిశీలన, న్యాయపరమైన అంశాలు, నిరసనలు, రాజకీయ ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో 'ఏమీ జరగలేదు' అనే ఒకే వాక్యం ప్రజల సందేహాలను పూర్తిగా తీర్చదు. అదే సమయంలో 'అంతా స్కామే' అనే ప్రతిపక్ష నినాదం కూడా దర్యాప్తు తుది ఫలితానికి ప్రత్యామ్నాయం కాదు. ఇక్కడ మరో కీలకమైన ప్రశ్న ఉంది. ఈ వ్యవహారంలో తప్పు జరిగితే బాధ్యత ఎవరిది? ఒక అభ్యర్థి తప్పుడు సర్టిఫికెట్ సమర్పిస్తే అతడే బాధ్యుడా? దాన్ని పరిశీలించిన అధికారి బాధ్యుడా? ధ్రువీకరించిన సంస్థది బాధ్యతా? నిబంధన మార్చిన శాఖ బాధ్యత తీసుకోవాలా? లేక ఎంపిక ప్రక్రియ మొత్తాన్ని పర్యవేక్షించిన వ్యవస్థ బాధ్యత వహించాలా? ఒకవేళ అన్ని సర్టిఫికెట్లు నిజమేనని తేలితే, నెలల తరబడి ఈ వివాదాన్ని కొనసాగించిన రాజకీయ ప్రచారానికి ఎవరు సమాధానం చెబుతారు? ఈ రెండు ప్రశ్నలకూ సమాధానం ఒకే విధంగా ఉండాలి... రికార్డుల ఆధారంగా. డీఎస్సీ వివాదం ఇప్పుడు కేవలం 372 ఉద్యోగాల కథ కాదు. ఇది ప్రభుత్వ నియామక వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకానికి సంబంధించిన కథ.



### • రాజకీయ క్రీడతో కాదు.. రికార్డులతోనే నిజం

ఎందుకంటే ప్రజలకు ఇప్పుడు కావాల్సింది మరో రాజకీయ యుద్ధం కాదు. మరో ప్రెస్‌మీట్ కాదు. మరో కౌంటర్ కాదు. మరో నినాదం కాదు. నిజం. ఒక ప్రభుత్వ నియామకంలో నిజం ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి ప్రజలు నెలల తరబడి రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం చూడాల్సిన అవసరం లేదు. ఒక అధికారిక వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు కనిపిస్తే చాలు. ఒక సర్టిఫికెట్ నిజమా కాదా తెలుసుకోవడానికి రాజకీయ నాయకుడి మాట అవసరం లేదు. సంబంధిత క్రీడా సంస్థ ధ్రువీకరణ చాలు. ఒక అభ్యర్థి నిబంధనలకు సరిపోతాడా లేదా తెలుసుకోవడానికి పార్టీ జెండా అవసరం లేదు. నిబంధనల పుస్తకం చాలు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా వివాదం అందుకే ప్రభుత్వానికి కూడా ఒక అవకాశం. ఆరోపణలను ఎదుర్కొనే అవకాశం కాదు.. వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చే అవకాశం. ప్రతిపక్షానికీ ఒక అవకాశం. రాజకీయ విమర్శను పత్రాధారాలతో ప్రజా చర్చగా మార్చే అవకాశం. ఉద్యోగార్థులకు ఒక అవకాశం. తమకు జరిగిన అన్యాయం ఉంటే దాన్ని నిరూపించుకునే అవకాశం. ఎంపికైన వారికి కూడా అదే అవకాశం. తమ అర్హతను బహిరంగంగా నిరూపించుకునే అవకాశం. అంతిమంగా ప్రశ్న ఒక్కటే... 372 మందికి ఉద్యోగాలు ఇచ్చారా లేదా అన్నది కాదు. ఆ 372 మందిలో ప్రతి ఒక్కరికి ఉద్యోగం రావడానికి కారణమైన అర్హత ఏమిటి? ఆ అర్హతను ఎవరు ఎలా ధ్రువీకరించారు? ఆ ధ్రువీకరణ రికార్డు ఎక్కడుంది? ఈ నాలుగు ప్రశ్నలకు ప్రభుత్వం పత్రాలతో సమాధానం చెప్పగలిగితే రాజకీయ వివాదం చాలా వరకు చల్లారిపోతుంది. సమాధానం ఇవ్వలేని ప్రశ్నలు మిగిలితే మాత్రం వివాదం కొనసాగుతూనే ఉంటుంది. ఇక ఎంతకాలం ఈ డీఎస్సీని రాజకీయ క్రీడగా మార్చుకుంటారు? నిరుద్యోగ యువత భవిష్యత్తు మీద రాజకీయ బ్యాటింగ్ ఇంకెంతకాలం? ప్రభుత్వం బౌలింగ్ చేస్తోందా? ప్రతిపక్షం బ్యాటింగ్ చేస్తోందా? అన్నది ప్రజలకు పెద్దగా అవసరం లేదు. స్కోర్‌బోర్డుపై నిజమైన స్కోరు ఎంత అన్నదే ముఖ్యం. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా వ్యవహారంలో ఆ స్కోర్‌బోర్డు ఒక్కటే ఉండాలి... రికార్డు. అర్హత. సర్టిఫికెట్. నిబంధన. నియామకం. అవి ప్రజల ముందుంటే ఎవరి మాట నమ్మాలో ప్రజలే నిర్ణయించుకుంటారు.



తెలంగాణ రాజకీయాల్లో దానం నాగేందర్ వ్యవహారం అనూహ్య మలుపు తీసుకుంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. అయితే తీర్పు వెలువడిన వెంటనే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు ఈ వ్యవహారానికి మరో కోణాన్ని తెచ్చాయి. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నానని, సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని దానం స్పష్టం చేశారు. న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగించడం కంటే ప్రజాక్షేత్రంలోనే తన రాజకీయ భవిష్యత్తును తేల్చుకుంటానన్న సంకేతం ఇచ్చారు. "ఎన్నికల్లో పోరాడటం నాకు కొత్త కాదు. పోరాటాలు చేస్తూ ఈ స్థాయికి వచ్చాను. ఎన్నికలు వస్తే ప్రజాక్షేత్రంలో పోరాడతా... విజయం సాధిస్తా" అని ఆయన పేర్కొన్నారు. దీంతో ఇంతకాలం అందరి దృష్టి సుప్రీంకోర్టు వైపు ఉండగా... దానం మాత్రం తన తదుపరి అడుగును రాజకీయ వేదిక వైపు మళ్లించినట్లయింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో సాధారణంగా కనిపించే తదుపరి న్యాయపోరాటం కాకుండా... ప్రజల మధ్యకు వెళ్లే మార్గాన్ని ఆయన ఎంచుకున్నట్లు ఆయన మాటలు చెబుతున్నాయి. ఇదే ఇప్పుడు దానం నాగేందర్ వ్యవహారంలో అసలు ట్విస్ట్‌గా మారింది. హైకోర్టు తీర్పు స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం సభ్యత్వాన్ని రద్దు చేసింది. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా మారిందని ప్రకటించింది. తీర్పు ప్రతిని అసెంబ్లీ స్పీకర్‌కు, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశించింది. తాజా నివేదికల ప్రకారం ఆయన అనర్హత 2024 ఏప్రిల్ 23 నుంచి అమల్లోకి వస్తుందని కోర్టు పేర్కొంది. ఆ తేదీన సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా దానం పోటీ చేసిన విషయం తీర్పులో కీలకంగా మారింది.

# డ్యామిట్..

# కథ అడ్డం తిరిగింది!



## దానంపై వేటు.. ఉపఎన్నికలో గెలుపు డౌటు!

- జోరుమీద కమలం, కారు... హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ బేజారు
- జూబ్లీహిల్స్ రిజల్ట్స్ రావడం కష్టం.. తేడా వస్తే అధికార పార్టీకి తీరని నష్టం





**• అసలు వివాదం ఎక్కడ మొదలైంది?**

2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్నికల తర్వాత 2024 మార్చిలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఆ తర్వాత సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఎమ్మెల్యేగా ఒక పార్టీ తరపున గెలిచి, ఆ పదవిలో కొనసాగుతున్న సమయంలో మరో పార్టీ తరపున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడం చుట్టూనే అసలు వివాదం మొదలైంది. బీఆర్ఎస్ తరపున పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ తరపున ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యవహారం తొలుత అసెంబ్లీ స్పీకర్ పరిధిలోకి వెళ్లింది. స్పీకర్ దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించేందుకు తగిన ఆధారాలు లేవని నిర్ణయించారు. ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. విచారణలో ప్రధాన ప్రశ్న ఒకటే. దానం నాగేందర్ బీఆర్ఎస్‌కు అధికారికంగా రాజీనామా చేయకపోయినా, ఆయన చేసిన రాజకీయ చర్యలను బట్టి పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లు పరిగణించవచ్చా? పిటిషనర్ల వాదన ఇదే. దానం కాంగ్రెస్‌లో చేరడం, కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం సాధారణ రాజకీయ చర్యగా చూడలేమని వారు వాదించారు. దానం తరపు న్యాయవాదులు మాత్రం పిటిషనర్లు ప్రధానంగా మీడియా కథనాలు, ఫొటోలు, రాజకీయ కార్యక్రమాలను ఆధారంగా చూపుతున్నారని వాదించారు. అసెంబ్లీ రికార్డుల్లో దానం బీఆర్ఎస్ సభ్యుడిగానే ఉన్నారని కూడా వాదించారు. ఈ వాదనలు విన్న హైకోర్టు స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసింది. అంటే కేసు కేవలం "రాజీనామా చేశారా లేదా?" అనే ఒక్క ప్రశ్న వద్ద ఆగలేదు. ఆయన రాజకీయ ప్రవర్తనను కూడా న్యాయపరంగా పరిశీలించింది.

**• మహాచంద్ర కేసు ఎందుకు కీలకమైంది?**

దానం నాగేందర్ కేసులో మహాచంద్ర ప్రసాద్ సింగ్ కేసు న్యాయసూత్రం కీలకంగా మారింది. 2004లో సుప్రీంకోర్టు విచారించిన ఆ కేసులో మహాచంద్ర ప్రసాద్ సింగ్ బీహార్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయన కాంగ్రెస్‌కు రాతపూర్వక రాజీనామా సమర్పించలేదన్న వాదన ఉన్నప్పటికీ, ఆయన చేసిన రాజకీయ చర్యలను పరిశీలించి కాంగ్రెస్ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లు నిర్ణయించారు. సుప్రీంకోర్టు ఆ నిర్ణయాన్ని సమర్థించింది. పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నట్లు నిర్ధారించడానికి కేవలం రాజీనామా పత్రం ఉండాల్సిందే అనే నిబంధన లేదన్న సూత్రం ఈ కేసులో స్పష్టమైంది. ఒక సభ్యుడి ప్రవర్తనను బట్టి కూడా పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లు నిర్ధారణకు రావచ్చని సుప్రీంకోర్టు వివరించింది. పదో షెడ్యూల్‌లోని ఫిరాయింపుల నిరోధక నిబంధనల అర్థాన్ని వివరించే ఈ తీర్పు దానం నాగేందర్ కేసులో పిటిషనర్ల వాదనకు ముఖ్యమైన ఆధారంగా మారింది. దానం 2023లో బీఆర్ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచారు. 2024లో కాంగ్రెస్‌లో చేరారు. అదే ఏడాది కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికలో పోటీ చేశారు. ఈ పరిణామాలన్నింటినీ కలిపి చూస్తే పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్న చర్యగా పరిగణించవచ్చని పిటిషనర్లు వాదించారు. హైకోర్టు తీర్పులో 2024 ఏప్రిల్ 23ను కీలక తేదీగా పరిగణించడం కూడా ఇదే నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో దానం నాగేందర్ వ్యవహారం ఒక వ్యక్తి రాజకీయ పార్టీ మార్పు వివాదం నుంచి, ఫిరాయింపుల చట్టాన్ని ఎలా అర్థం చేసుకోవాలన్న పెద్ద న్యాయ ప్రశ్నగా మారింది.

**• "సుప్రీంకోర్టుకు వెళ్లను".. దానం అసలు వ్యూహం ఇదేనా?**

హైకోర్టు తీర్పు తర్వాత అందరి దృష్టి సహజంగానే దానం నాగేందర్ తదుపరి న్యాయపరమైన అడుగుపై పడింది. తీర్పును సవాలు చేస్తారా? సుప్రీంకోర్టుకు వెళ్తారా? స్టే కోరుతారా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపించాయి. అయితే దానం నాగేందర్ స్వయంగా ఇచ్చిన సమాధానం మాత్రం ఈ అంచనాలను మార్చేసింది. "హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా.. సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఇంకా ఒక అడుగు ముందుకేసి తన పోరాటం కోర్టులో కాదని, ప్రజాక్షేత్రంలోనేనని చెప్పారు. "ప్రజా క్షేత్రంలో, ఎన్నికల్లోనే కొట్లాడుతాం" అన్న ఆయన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎన్నికలు వస్తే ప్రజల మధ్యకు వెళ్లి పోరాడతానని, విజయం సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలను చూస్తే హైకోర్టు తీర్పును రాజకీయ ముగింపుగా కాకుండా మరో ఎన్నికల పోరాటానికి ప్రారంభ బిందువుగా దానం చూస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే ఆయన వ్యాఖ్యలను భవిష్యత్ ఎన్నికల్లో ఆయనకు విజయావకాశాలపై అంచనాగా చూడాల్సిన అవసరం లేదు. దానం స్వయంగా తన రాజకీయ స్థైర్యాన్ని ప్రజల తీర్పుతో నిరూపించుకోవాలని చెబుతున్నారు. ఇది ఆయన ఎంచుకున్న రాజకీయ మార్గంగా మాత్రమే చూడాలి. సుప్రీంకోర్టుకు వెళ్లకపోతే హైకోర్టు తీర్పు అమలులో ఉండే అవకాశం ఉంటుంది. ఖైరతాబాద్ సీటు ఖాళీగా ఉన్న పరిస్థితి కొనసాగుతుంది. తదుపరి చర్యలు ఎన్నికల సంఘం ప్రక్రియపై ఆధారపడతాయి. అదే సమయంలో దానం స్వయంగా ఉపఎన్నికలో పోటీ చేస్తారా లేదా అన్నది కూడా ప్రస్తుతం అధికారికంగా స్పష్టంగా లేదు. కానీ ఆయన తాజా మాటల్లో ఒక విషయం మాత్రం స్పష్టంగా ఉంది. పదవిని కాపాడుకునే న్యాయపోరాటం కంటే, ప్రజల వద్దకు వెళ్లి తన రాజకీయ స్థానం నిరూపించుకోవడానికే ఆయన ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు.

**• ఖైరతాబాద్‌లో ఇక ఎన్నికల లెక్కలు మొదలు**

హైకోర్టు దానం నాగేందర్ సభ్యత్వాన్ని రద్దు చేసి ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ప్రకటించడంతో ఇప్పుడు తదుపరి దశ ఎన్నికల ప్రక్రియపై ఆధారపడి ఉంటుంది. అయితే సీటు ఖాళీ కావడం, ఉపఎన్నిక తేదీ ప్రకటించడం రెండు వేర్వేరు దశలు. ఎన్నికల సంఘం నుంచి అధికారిక నోటిఫికేషన్ వచ్చిన తర్వాతే ఉపఎన్నిక షెడ్యూల్ స్పష్టమవుతుంది. ప్రస్తుతానికి హైకోర్టు తన తీర్పు ప్రతిని స్పీకర్‌కు, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశించింది. త్వరలో ఎన్నికపై స్పష్టత రానుంది. పరిణామాలన్నీ కూడా.. ఖైరతాబాద్ నియోజకవర్గంపై పార్టీల ఫోకస్ పడేలా చేశాయి. బీఆర్ఎస్ ఇప్పటికే దానం అనర్హత అంశంపై న్యాయపోరాటం చేసింది. హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మిగిలిన ఫిరాయింపుదారులకు ఇదే గతి పడుతుందని జోస్యం చెప్పిన ఆయన.. సత్యమేవ జయతే అంటూ ట్వీట్ చేశారు. ఈ తీర్పును పార్టీకి ముఖ్యమైన న్యాయపరమైన పరిణామంగా పాడి కౌశిక్‌రెడ్డి అభివర్ణించారు. బీజేపీ తరపున ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా ఈ వ్యవహారంలో పిటిషనర్‌గా ఉన్నారు. దీంతో ఉపఎన్నిక జరిగే పరిస్థితి ఏర్పడితే రెండు పార్టీలు తమ రాజకీయ వ్యూహాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది. కాంగ్రెస్‌కు మరో విధమైన పరిస్థితి ఉంటుంది. దానం నాగేందర్ నేరుగా తనే ఎన్నికల్లో పోటీ చేస్తానంటూ తేల్చి చెప్పారు. అయితే ఈ దశలో ఏ పార్టీ గెలుస్తుందనే నిర్ణయం చెప్పడం సాధ్యం కాదు. అభ్యర్థులు ఎవరు, పోటీ ఎలా ఉంటుంది, ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుంది, స్థానిక రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయి అన్న అంశాలపై ఫలితం ఆధారపడి ఉంటుంది.



**• దానం మాటతో ముగిసిన న్యాయ అధ్యాయం**

నాగేందర్ వ్యవహారం ఇప్పుడు ఒక కీలక దశకు చేరుకుంది. 2023లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యే.. 2024లో కాంగ్రెస్‌లో చేరడం.. అదే పార్టీ తరపున సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికలో పోటీ చేయడం.. ఆ తర్వాత అనర్హత పిటిషన్లు.. స్పీకర్ నిర్ణయం.. దానిపై హైకోర్టు విచారణ.. చివరకు సభ్యత్వ రద్దు వరకు ఈ వ్యవహారం సాగింది. హైకోర్టు తీర్పు న్యాయపరమైనంగా ఒక కీలక నిర్ణయం తీసుకుంది. కానీ దానం నాగేందర్ స్పందన ఈ కథకు మరో మలుపు ఇచ్చింది. సాధారణంగా ఇలాంటి పరిస్థితిలో సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం గురించి చర్చ జరుగుతుంది. దానం మాత్రం అలాంటి ఆలోచన లేదని స్పష్టంగా చెప్పారు. తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని.. ఖైరతాబాద్ ఉపఎన్నికలో పోటీకి సిద్ధమని తేల్చి చెప్పారు. ఎన్నికలు తనకు కొత్త కాదని.. ఉపఎన్నిక ఎప్పుడొచ్చినా తాను రెడీ అన్నారు. ఎన్నికల్లో పోరాడి.. మళ్లీ ఎమ్మెల్యేగా గెలుస్తానని దానం నాగేందర్ విశ్వాసం వ్యక్తం చేశారు. గతంలో కూడా పార్టీ మార్పులు, ఎన్నికల పోటీలు, ఓటములు, విజయాలను ఎదుర్కొన్న తన రాజకీయ జీవితంలో ప్రజల తీర్పుకే ప్రాధాన్యం ఉందన్న భావనను ఆయన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఖైరతాబాద్‌లో సీటు ఖాళీగా మారిన నేపథ్యంలో తదుపరి పరిణామాలు ఎన్నికల సంఘం చర్యలపై ఆధారపడి ఉంటాయి. ఉపఎన్నిక వస్తే అభ్యర్థుల ఎంపిక, పార్టీల వ్యూహాలు, స్థానిక సమీకరణాలు, ప్రచార అంశాలు కీలకం కానున్నాయి. మరోవైపు దానం కేసులో హైకోర్టు ఉపయోగించిన న్యాయపరమైన దృక్పథం ఇతర ఫిరాయింపు కేసుల్లో ఎలా చర్చకు వస్తుందన్నది కూడా గమనించాల్సిన అంశం. ప్రతి కేసు వాస్తవాలు వేరుగా ఉంటాయి కాబట్టి ఒక తీర్పును మరో కేసుకు నేరుగా వర్తింపజేయడం సాధ్యం కాదు. అయినప్పటికీ "రాజీనామా చేయకపోయినా రాజకీయ ప్రవర్తన ఆధారంగా సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లు పరిగణించవచ్చా?" అన్న ప్రశ్నకు దానం కేసు కొత్త ప్రాధాన్యం తెచ్చింది. ఇప్పుడు దానం నాగేందర్ ముందు ఉన్న రాజకీయ వేదిక ఒక్కటే. అది ప్రజాక్షేత్రం. ఆయన మాటల్లోనే చెప్పాలంటే.. ఎన్నికలు వస్తే ప్రజల మధ్యే పోరాటం. అక్కడే తన రాజకీయ భవిష్యత్తును తేల్చుకోవాలన్నది ఆయన వైఖరి. అందివచ్చిన అవకాశాన్ని బీఆర్ఎస్, బీజేపీ ఏ విధంగా వినియోగించుకుంటాయన్నది చూడాలి.







అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి వైట్‌హౌస్‌లోకి వచ్చిన తరువాత ఆయన పాలన చుట్టూ రాజకీయ, ఆర్థిక, విదేశాంగ ప్రశ్నలు వేగంగా పెరుగుతున్నాయి. 2024 ఎన్నికల్లో విజయం సాధించి 2025 జనవరిలో బాధ్యతలు స్వీకరించిన ట్రంప్ ప్రస్తుత పదవీకాలం రాజ్యాంగ పరంగా 2029 జనవరి 20తో ముగియాల్సి ఉంది. అయితే ఆయన పూర్తి కాలం కొనసాగుతారా అన్న ప్రశ్నకు ప్రస్తుతం కచ్చితమైన సమాధానం చెప్పడం సాధ్యం కాదు. అధ్యక్షుడి పదవీకాలం మధ్యలో ముగిస్తే ఉపాధ్యక్షుడికి అధికారం ఎలా బదిలీ అవుతుందో అమెరికా రాజ్యాంగంలోని 25వ సవరణ స్పష్టంగా చెబుతోంది. అధ్యక్షుడు మరణించినా, రాజీనామా చేసినా, పదవి నుంచి తొలగించబడినా ఉపాధ్యక్షుడు అధ్యక్షుడవుతారు. అధ్యక్షుడు తాత్కాలికంగా విధులు నిర్వర్తించలేని పరిస్థితి ఏర్పడితే ఉపాధ్యక్షుడు యాక్టింగ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించే విధానం కూడా అందులో ఉంది. ఆరోగ్యంపై వస్తున్న ఊహాగానాల ఆధారంగా ట్రంప్ పదవీకాలం మధ్యలో ముగుస్తుందని చెప్పలేం. అదే సమయంలో ఆయన విధానాలపై ప్రజాభిప్రాయం మారుతున్న సంకేతాలు మాత్రం కనిపిస్తున్నాయి. సెప్టెంబర్ 21న వెలువడిన రాయటర్స్, ఐపోస్ సర్వేలో ట్రంప్ ఆమోదం 32 శాతానికి పడిపోయింది. రిపబ్లికన్ ఓటర్లలో ఆయనకు మద్దతు ఒక వారంలో 82 శాతం నుంచి 73 శాతానికి తగ్గినట్లు సర్వే వెల్లడించింది. దీన్ని అధ్యక్ష పదవీకాలం ముగుస్తుందనే సూచనగా చూడలేకున్నా.. సంథింగ్ ఏదో జరుగుతుందన్న భావనను కలిగిస్తున్నాయి. మొత్తంగా, ట్రంప్‌కు ఎదురవుతున్న ఒత్తిడి పెరుగుతోందనే సంకేతంగా మాత్రం చూడవచ్చు.

# అంతా నా ఇష్టం

మీడియాపై ఫైర్.. ప్రజా వ్యతిరేకతపై డోన్ట్ కేర్

## ట్రంప్ న్యూసెన్స్.. రోజుకో నాన్సెన్స్..



### అమెరికన్లకు మేలా.. భారమా?

“అమెరికా ఫస్ట్” విధానంతో దేశ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్తానన్నది ట్రంప్ ప్రధాన రాజకీయ నినాదం. సరిహద్దు భద్రత, వలస నియంత్రణ, అమెరికా తయారీ, ఇంధన ఉత్పత్తి, చైనా సహా ఇతర దేశాలపై వాణిజ్య ఒత్తిడి ఆయన విధానాల్లో కీలకంగా ఉన్నాయి. వైట్ హౌస్ తన పాలనకు సంబంధించిన అధికారిక నివేదికల్లో ఉద్యోగాలు, పెట్టుబడులు, ఇంధన ఉత్పత్తి, సరిహద్దు నియంత్రణ వంటి రంగాల్లో సాధించిన విజయాలను ప్రస్తావిస్తోంది. అయితే ప్రజల రోజువారీ జీవితం విషయంలో ఫలితాలపై చర్చ భిన్నంగా ఉంది. ద్రవ్యోల్బణం, చమురు ధరలు, దిగుమతి ఖర్చులు అమెరికన్ కుటుంబాలపై ప్రభావం చూపుతున్నాయి. ఆగస్టులో అమెరికా దిగుమతి ధరలు ఏడాది ప్రాతిపదికన 7 శాతం పెరిగాయి. ఇది 2022 తరువాత అత్యధిక పెరుగుదల అది. ఇరాన్ యుద్ధం కారణంగా చమురు మార్కెట్లలో ఒత్తిడి పెరగడం కూడా అమెరికా వినియోగదారులపై ప్రభావం చూపుతోంది. మరోవైపు ట్రంప్‌కు మద్దతు ఇచ్చే వర్గాలు సరిహద్దు నియంత్రణ, దేశీయ పరిశ్రమల రక్షణ, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలను ప్రయోజనాలుగా చూపుతున్నాయి. కాబట్టి “ట్రంప్ నిర్ణయాలు అమెరికన్లకు మొత్తం మీద మేలు చేశాయా?” అన్న ప్రశ్నకు ఒకే సమాధానం లేదు. ఎవరికి మేలు, ఏ రంగంలో మేలు, ఏ కాలంలో మేలు అన్నదే అసలు ప్రశ్న. ఆర్థిక విధానాల ప్రభావం కుటుంబాల ఆదాయం, ధరలు, ఉద్యోగాలు, వ్యాపారాలపై విడివిడిగా కనిపిస్తుంది. అందుకే “అమెరికా ఫస్ట్” ఫలితాలను నినాదంతో కాకుండా గణాంకాలతో అంచనా వేయాల్సి ఉంటుంది.

### రిపబ్లికన్ పార్టీలో మారుతున్న స్వరం

ట్రంప్ ఇప్పటికీ రిపబ్లికన్ పార్టీలో అత్యంత ప్రభావశీల నాయకుడిగానే ఉన్నారు. ముఖ్యంగా వలసలు, సరిహద్దు భద్రత, సాంస్కృతిక అంశాలపై ఆయనకు పార్టీ కార్యకర్తల్లో గట్టి మద్దతు కొనసాగుతోంది. అయితే ఇరాన్ యుద్ధం, పెరుగుతున్న ఇంధన ధరలు, జీవన వ్యయంపై అసంతృప్తి నేపథ్యంలో పార్టీలో కొన్ని భిన్న స్వరాలు బహిర్గతమవుతున్నాయి. సెప్టెంబర్ 21న రాయిటర్స్ నివేదిక ప్రకారం రిపబ్లికన్ సెనేట్ అభ్యర్థులు మైక్ రోజర్స్, యాష్లే హిన్సన్ ఇరాన్ యుద్ధాన్ని త్వరగా ముగించాలని బహిరంగంగా కోరారు. మరికొందరు రిపబ్లికన్ నేతలు అధ్యక్షుడి యుద్ధాధికారాలపై పరిమితులు అవసరమని చెబుతున్నారు. ఇదే సమయంలో రిపబ్లికన్ పార్టీలో భవిష్యత్ నాయకత్వంపై చర్చ కూడా మొదలైంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇప్పటికే ట్రంప్ తరువాతి తరం నాయకుడిగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. రిపబ్లికన్ సమావేశాల్లో ఆయనకు లభిస్తున్న స్పందన 2028 అధ్యక్ష పోటీపై ఊహాగానాలను పెంచింది. అయితే ఇప్పుడే ఎవరు పార్టీని నడిపిస్తారు... 2028లో ఎవరు అభ్యర్థి అవుతారని ఖరారు చేయడం తొందరపాటవుతుంది. ట్రంప్ మూడోసారి అధ్యక్షుడిగా పోటీ చేయలేరు. కాబట్టి ఆయన తరువాత పార్టీ నాయకత్వం కోసం వాన్స్‌తో పాటు ఇతర రిపబ్లికన్ నేతల పేర్లు చర్చలోకి రావడం సహజం. డెమోక్రాట్లు కూడా 2026 మధ్యంతర ఎన్నికలను కీలక రాజకీయ పోరుగా చూస్తున్నారు. తాజా రాయిటర్స్, ఐపోస్ సర్వేలో డెమోక్రాట్లకు 43 శాతం, రిపబ్లికన్లకు 35 శాతం ఓటు లభించనున్నట్టు తేలింది. ఇది ఎన్నికల ఫలితానికి హామీ కాదు. కానీ ఇరు పార్టీల మధ్య పోటీ తీవ్రంగా మారుతున్న వాతావరణాన్ని మాత్రం చూపుతోంది.

### సంపద పెరిగిందా.. మార్కెట్లపై ప్రభావమా?

ట్రంప్ వ్యక్తిగత సంపదపై కూడా తీవ్ర చర్చ జరుగుతోంది. 2026 ఆర్థిక వెల్లడి వివరాలపై రాయిటర్స్ చేసిన విశ్లేషణ ప్రకారం 2025లో క్రిప్టో సంబంధిత వ్యాపారాలు, ట్రంప్ పేరుతో నడిచిన డిజిటల్ ఆస్తుల ప్రాజెక్టుల ద్వారా ఆయనకు భారీ ఆదాయం వచ్చింది. ఆ ఆదాయంలో కొంత భాగాన్ని స్టాక్స్, బాండ్ల వంటి సంప్రదాయ పెట్టుబడుల్లోకి మళ్లించినట్లు నివేదిక పేర్కొంది. 2025లో ఆయనకు క్రిప్టో ప్రాజెక్టుల ద్వారా వచ్చిన ఆదాయం 1.4 బిలియన్ డాలర్లకు మించినట్లు వెల్లడైంది. ఇక్కడ మరో ముఖ్యమైన ప్రశ్న మార్కెట్ హెచ్చుతగ్గులను ట్రంప్ వ్యక్తిగత లాభం కోసం ఉద్దేశపూర్వకంగా ప్రభావితం చేస్తున్నారా అన్నది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధారాలతో అలాంటి ఉద్దేశపూర్వక మార్కెట్ మానిప్యులేషన్‌ను నిర్ధారించలేకున్నా.. మొత్తం చర్చ దాని చుట్టూనే తిరుగుతోంది. అయితే అధ్యక్షుడిగా విధాన నిర్ణయాలు తీసుకునే వ్యక్తికి వ్యక్తిగత వ్యాపార ప్రయోజనాలు ఉండటం వల్ల ప్రయోజనాల సంఘర్షణపై ప్రశ్నలు తలెత్తడం మాత్రం వాస్తవం. ముఖ్యంగా క్రిప్టో రంగంపై ట్రంప్ బహిరంగ మద్దతు ఇవ్వడం, ఆయన కుటుంబానికి సంబంధించిన వ్యాపార ప్రయోజనాలు కొనసాగడం ఈ చర్చకు కారణమవుతున్నాయి. మరోవైపు మార్కెట్‌లో ప్రతి పెరుగుదల, ప్రతి పతనం ట్రంప్ నిర్ణయాల వల్లే జరుగుతుందని చెప్పడం కూడా వాస్తవం కాకున్నా.. ఆయన మాటలు ప్రభావం చూపెడుతున్నాయన్న భావన కలుగుతోంది. వడ్డీ రేట్లు, చమురు ధరలు, యుద్ధాలు, కంపెనీల లాభాలు, పెట్టుబడిదారుల అంచనాలు వంటి అనేక అంశాలు మార్కెట్లను ప్రభావితం చేస్తాయి. అందువల్ల ట్రంప్ విధానాల వల్ల మార్కెట్‌లో అస్థిరత పెరిగిందా అన్నది వేరు. ఆయన వ్యక్తిగత లాభం కోసం కావాలనే మార్కెట్‌ను కదిలించారా అన్నది వేరే అంశం.

### ఇరాన్ యుద్ధం.. ప్రపంచానికి కొత్త సంక్షోభం

అఫ్గానిస్థాన్, ఇరాక్ యుద్ధాలను వ్యతిరేకించిన ట్రంప్ ఇప్పుడు ఇరాన్‌పై సైనిక చర్యకు ఎందుకు వెళ్లారన్న ప్రశ్న అత్యంత కీలకం. ట్రంప్ తన చర్యకు ప్రధాన కారణాలుగా ఇరాన్ అణు కార్యక్రమం, బాలిస్టిక్ క్షిపణులు, అమెరికా సైనికులు, మిత్రదేశాల భద్రత, ప్రాంతీయ ముప్పులను ప్రస్తావించారు. ఫిబ్రవరి 28, 2026న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో ప్రస్తుత ఇరాన్ యుద్ధం ప్రారంభమైందని రాయిటర్స్ నివేదించింది. అయితే ఆ యుద్ధం తక్కువ కాలంలో ముగుస్తుందని భావించినప్పటికీ ఆరు నెలలకు పైగా కొనసాగడం అంతర్జాతీయ ఆందోళనను పెంచింది. చమురు ధరలు, రెడ్ సీ నౌకాయానం, అమెరికా సైనిక వ్యయం, మిత్రదేశాల భద్రతపై ప్రభావం పడుతోంది. అమెరికా అఫ్గానిస్థాన్ యుద్ధాన్ని 2021లో ముగించింది. ఐతే, అమెరికా, యూరప్ దేశాలు అఫ్గానిస్థాన్ విషయంలో మానవతా సహాయం, భద్రతా పరిణామాలు, తాలిబన్ పాలన వంటి అంశాలపై విధానాలు కొనసాగిస్తున్నాయి. మరోవైపు రష్యాతో ట్రంప్ సంబంధాలపై కూడా భిన్న వ్యాఖ్యానాలు ఉన్నాయి. ఉక్రెయిన్ విషయంలో అమెరికా, యూరప్ మధ్య వ్యూహాత్మక చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇరాన్ యుద్ధం మాత్రం ట్రంప్ విదేశాంగ విధానంలో “యుద్ధాలను ముగిస్తా” అన్న వాగ్దానానికి విరుద్ధంగా నిలిచిన అతిపెద్ద పరీక్షగా మారింది.

### భారత్‌పై టారిఫ్‌లు.. మీడియాపై ఆంక్షలు

భారత్‌పై ట్రంప్ సుంకాల ప్రభావం కూడా రెండు దేశాల ఆర్థిక సంబంధాలకు కీలక పరీక్షగా మారింది. అమెరికా నుంచి అధిక సుంకాలు వస్తే భారత ఎగుమతిదారులు అమెరికా మార్కెట్లో పోటీ సామర్థ్యం కోల్పోయే ప్రమాదం ఉంది. అదే సమయంలో అమెరికా దిగుమతిదారులు అధిక ధరలు చెల్లించాల్సి రావచ్చు. ఆ ఖర్చులో కొంత భాగం వినియోగదారులపై పడే అవకాశం ఉంటుంది. రష్యా చమురు కొనుగోళ్లకు సంబంధించి భారతదేశంపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం కల్పించే అమెరికా చట్టపరమైన చర్యలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. భారత రిఫైనరీ సంస్థలు లాభాలపై ఒత్తిడి, చమురు ధరల పెరుగుదలపై హెచ్చరిస్తున్నాయి. అంటే ఖర్చు పూర్తిగా భారత్‌దే అని చెప్పలేం.. పూర్తిగా అమెరికాదే అని కూడా చెప్పలేం. సరఫరా గొలుసు, కంపెనీల మార్జిన్లు, వినియోగదారుల ధరలు అన్నింటిపైనా ప్రభావం విస్తరించవచ్చు. ఇదే సమయంలో వైట్ హౌస్ మీడియా విధానం మరో పెద్ద వివాదానికి కారణమైంది. సీఎన్ఎన్, ఎంఎస్‌నౌ, పొలిటికో జర్నలిస్టులను వైట్ హౌస్ ప్రాంగణంలోకి అనుమతించకపోవడంపై ఆ సంస్థలు న్యాయపోరాటానికి దిగాయి. సెప్టెంబర్ 21న ఈ మూడు సంస్థలు ట్రంప్ ప్రభుత్వంపై కేసు దాఖలు చేశాయి. మీడియా ప్రతినిధులను దూరం చేయడం ద్వారా అధ్యక్షుడికి సమాచార ప్రవాహంపై మరింత నియంత్రణ లభించవచ్చని పరిపాలన భావించవచ్చు. కానీ ప్రధాన మీడియా సంస్థలు కోర్టులను ఆశ్రయించడం, ప్రత్యామ్నాయ మార్గాల్లో రిపోర్టింగ్ చేయడం కూడా జరుగుతోంది. మీడియాను నియంత్రించే ప్రయత్నం తాత్కాలికంగా అధికారానికి ప్రయోజనం కలిగించినా, దీర్ఘకాలంలో పారదర్శకత, ప్రజా విశ్వాసం, అధికార పర్యవేక్షణపై పెద్ద ప్రశ్నలను లేవనెత్తుతుంది. మొత్తం మీద ట్రంప్ రెండో పాలన అమెరికా దేశీయ రాజకీయాలకే కాకుండా ప్రపంచ వాణిజ్యం, యుద్ధాలు, మీడియా స్వేచ్ఛ, అంతర్జాతీయ సంబంధాలపై కూడా ప్రభావం చూపుతున్న దశగా మారింది.








# ఆసియా క్రీడల్లో భారత్ జైత్రయాత్ర!

ఆకాశమే హద్దుగా బ్యాటింగ్.. అదిరిపోయే బౌలింగ్.. ఫైనల్లో ప్రత్యర్థికి ఎక్కడా అవకాశం ఇవ్వని ఆధిపత్యం.. ఆసియా క్రీడలు 2026లో భారత మహిళల క్రికెట్ జట్టు స్వర్ణ పతకంతో తన బంగారు వేటకు ఘనమైన శ్రీకారం చుట్టింది! హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు ఫైనల్లో శ్రీలంకను ఏకంగా 147 పరుగుల తేడాతో చిత్తు చేసి టైటిల్‌ను నిలబెట్టుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ పరుగుల వరద పారించింది. స్మృతి మంధాన విధ్వంసక ఇన్నింగ్స్‌తో 45 బంతుల్లో 79 పరుగులు బాదగా, రిచా ఘోష్ కేవలం 22 బంతుల్లోనే అజేయంగా 49 పరుగులు చేసి స్కోర్‌బోర్డును పరుగులు పెట్టించింది. వీరి దూకుడుతో భారత్ 20 ఓవర్లలో 216/3 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఆసియా క్రీడల మహిళల క్రికెట్‌లో ఇదే అత్యధిక స్కోర్‌గా రికార్డైంది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు భారత బౌలర్ల ధాటికి ఏ దశలోనూ ఊపిరి పీల్చుకునే అవకాశం దక్కలేదు. వరుసగా వికెట్లు కోల్పోతూ కుప్పకూలిన శ్రీలంక చివరకు కేవలం 69 పరుగులకే ఆలౌటైంది. 147 పరుగుల భారీ విజయంతో భారత్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. బ్యాట్ నుంచి బంతి వరకు సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన హర్మన్‌ప్రీత్ సేన ఆసియా క్రీడల్లో భారత్ స్వర్ణ వేటకు అద్భుతమైన ఆరంభాన్ని అందించింది.

## జపాన్‌పై భారత్ థ్రిల్లింగ్ విజయం.. రెండు పరుగులే తేడా!

వర్షం అడ్డుకున్న మ్యాచ్.. ఐదు ఓవర్ల పోరాటం.. ప్రతి బంతికీ ఉత్కంఠ.. చివరికి భారత్‌దే పైచేయి! సానో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో మంగళవారం జరిగిన చారిత్రాత్మక వన్‌ఆఫ్ టీ20లో జపాన్‌పై భారత్ రెండు పరుగుల తేడాతో థ్రిల్లింగ్ విజయాన్ని నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు జపాన్ స్పిన్నర్లు చుక్కలు చూపించారు. టర్న్, అదనపు బౌన్స్‌తో భారత బ్యాటర్లను కట్టడి చేస్తూ ఐదు ఓవర్లలో 32/4కే పరిమితం చేశారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 12 బంతుల్లో ఒక ఫోర్‌తో 16 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలవగా, సంజూ శాంసన్ 7 బంతుల్లో 9 పరుగులు చేశాడు. జపాన్ బౌలర్ చార్లీ హరాహిన్జ్ రెండు ఓవర్లలో 17 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టి భారత బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. 33 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన జపాన్ కూడా గట్టిగానే పోరాడింది. భారత బౌలర్లు ఒత్తిడిని పెంచినా ఆతిథ్య జట్టు చివరి వరకు విజయంపై ఆశలు నిలుపుకుంది. అయితే వాషింగ్టన్ సుందర్ 2/13తో కీలక దెబ్బలు కొట్టాడు. చివరి బంతుల వరకు ఉత్కంఠ సాగిన పోరులో జపాన్ 30/3కే నిలిచిపోయింది. దీంతో భారత్ రెండు పరుగుల తేడాతో చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది.



## స్వర్ణం తర్వాత స్మృతి లక్ష్యం ఒలింపిక్స్!




ఆసియా క్రీడల్లో స్వర్ణం మెడలో మెరిసినా.. స్మృతి మంధాన చూపు మాత్రం ముందున్న అతిపెద్ద లక్ష్యంపైనే! శ్రీలంకపై 147 పరుగుల ఘన విజయంతో వరుసగా రెండో ఆసియా క్రీడల స్వర్ణాన్ని సొంతం చేసుకున్న భారత మహిళల జట్టు సంబరాల్లో మునిగిపోకముందే మంధాన భవిష్యత్ బాటను స్పష్టం చేసింది. ఫైనల్లో 45 బంతుల్లో 79 పరుగులతో భారత భారీ విజయంలో కీలక పాత్ర పోషించిన స్మృతి.. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో స్వర్ణమే లక్ష్యంగా వచ్చే ఏడాదిన్నర నుంచి రెండేళ్లు మరింత కష్టపడాల్సి ఉంటుందని చెప్పింది. ఆసియా క్రీడలతో పోలిస్తే ప్రపంచ క్రికెట్‌లో పోటీ మరింత కఠినంగా ఉంటుందని, వరల్డ్‌కప్ లేదా ఒలింపిక్స్‌లో విజయం సాధించాలంటే నిరంతరం మెరుగుపడాల్సిందేనని స్పష్టం చేసింది. "ఈ విజయంపై ఎక్కువసేపు ఆగిపోలేం.. ఇంకా మెరుగవ్వాలి" అంటూ జట్టు దృష్టిని తదుపరి సవాళ్లపైకి మళ్లించింది. భారత బృందంలో భాగంగా తొలి స్వర్ణాన్ని అందుకోవడం గర్వంగా ఉందన్న స్మృతి.. జాతీయ పతాకం పైకెగరడం, జాతీయ గీతం వినిపించడం మరచిపోలేని అనుభూతి అని చెప్పింది. ఆటలో ఒడిదుడుకులు ఎదురైనప్పుడు ధ్యానం, శ్వాసాభ్యాసం తనకు ప్రశాంతత ఇస్తాయని తెలిపింది. మైదానం బయట క్రికెట్ భారాన్ని మోసుకెళ్లకపోవడం తన జీవిత నియమమని వెల్లడించింది.

## షఫాలీ దూకుడు.. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో జోరు!

ఆసియా క్రీడల్లో రికార్డుల మోత మోగించిన భారత ఓపెనర్ షఫాలీ వర్మకు ఇప్పుడు ఐసీసీ ర్యాంకింగ్స్‌లోనూ దూసుకెళ్లే సమయం వచ్చింది. అద్భుతమైన ఫామ్‌కు ప్రతిఫలంగా తాజా మహిళల టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో షఫాలీ రెండు స్థానాలు ఎగబాకి నాలుగో ర్యాంక్‌కు చేరుకుంది. 756 రేటింగ్ పాయింట్లతో స్మృతి మంధాన, వెస్టిండీస్ హేలీ మాథ్యూస్‌ను వెనక్కి నెట్టి టాప్ 4లోకి అడుగుపెట్టింది. ఆసియా కప్ సెమీఫైనల్, ఫైనల్లో వరుసగా 64, 68 పరుగులు చేసిన షఫాలీ.. ఆసియా క్రీడల్లో మరింత విధ్వంసం సృష్టించింది. జపాన్‌పై క్వార్టర్‌ఫైనల్లో అజేయంగా 40 పరుగులు చేసిన ఆమె.. బంగ్లాదేశ్‌పై సెమీఫైనల్లో కేవలం 49 బంతుల్లోనే అజేయంగా 100 పరుగులు బాది సంచలనం సృష్టించింది. ఆసియా క్రీడల చరిత్రలో శతకం సాధించిన తొలి మహిళగా రికార్డు సొంతం చేసుకుంది. శ్రీలంకతో ఫైనల్లో స్మృతి మంధానతో కలిసి 48 పరుగుల కీలక భాగస్వామ్యం అందించి భారత్ స్వర్ణ విజయంలో భాగమైంది. ఇదే సమయంలో టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్ ద్వయం ఎన్ శ్రీచరణి, దీప్తి శర్మ అగ్రస్థానాల్లో కొనసాగుతున్నారు. ఆసియా క్రీడల ఫైనల్లో దీప్తి 3/6తో చెలరేగగా, షఫాలీ, శ్రేయాంక పాటిల్ చెరో రెండు వికెట్లు తీసి శ్రీలంకను 69 పరుగులకే కుప్పకూల్చారు.




# నానికి ప్యారడైజ్.. బాక్సాఫీస్‌కు పండగ!

### హైదరాబాద్‌లో 77 స్క్రీన్లు.. ఓపెనింగ్‌కు మోత!




నేచురల్ స్టార్ నాని నటించిన 'ది ప్యారడైజ్' విడుదలకు ముందే బాక్సాఫీస్‌ను షేక్ చేసే సంకేతాలు ఇస్తోంది. 'హిట్: ది థర్డ్ కేస్' తర్వాత నాని నుంచి వస్తున్న ఈ భారీ తెలుగు యాక్షన్ థ్రిల్లర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. 'ఆయా షేర్' పాట రేపిన హైప్ ఇప్పుడు అడ్వాన్స్ బుకింగ్స్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం పరిమిత కేంద్రాల్లోనే బుకింగ్స్ ఓపెన్ అయినా దాదాపు 1,150 షోలు అడ్వాన్స్ బుకింగ్‌కు వచ్చినట్లు సమాచారం. విడుదలకు ఇంకా రెండు రోజులు ఉండటంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. మరోవైపు హైదరాబాద్‌లో 78 సింగిల్ స్క్రీన్లకు గాను ఏకంగా 77 స్క్రీన్లు 'ది ప్యారడైజ్'కే దక్కడం నాని క్రేజ్‌కు అద్దం పడుతోంది. ఈ ఏడాది అతిపెద్ద రిలీజ్‌లలో ఒకటిగా నిలవనున్న ఈ సినిమా.. పోటీ లేకపోవడంతో టికెట్ విండోస్‌పై మరింత దూకుడు చూపించే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం నాని కెరీర్‌లో తొలి రోజు అత్యధికంగా రూ.23.2 కోట్ల నెట్ వసూలు చేసిన 'దసరా' రికార్డు ఉండగా.. 'ది ప్యారడైజ్' దాన్ని దాటడమే కాదు, రూ.30 కోట్ల నెట్ ఓపెనర్‌గా నాని కెరీర్‌లో కొత్త అధ్యాయానికి తెరతీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా టాక్ బలంగా వస్తే బాక్సాఫీస్ దగ్గర అసలైన ప్యారడైజ్ మొదలైనట్టే!

## శర్వానంద్ నుంచి ఫస్ట్ బూస్టర్!

### సంక్రాంతికి 'జార్జ్ క్రిష్' జోరు షురూ!

టాలీవుడ్‌లో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు కొత్త ఊపు తెచ్చేందుకు చార్మింగ్ స్టార్ శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్ల జోడీ సిద్ధమవుతోంది. వీరిద్దరి కలయికలో తెరకెక్కుతున్న 'జార్జ్ క్రిష్'పై ఇప్పటికే ఆసక్తి పెరుగుతుండగా.. ఇప్పుడు మూవీ టీమ్ ప్రేక్షకులకు అదిరిపోయే బూస్టర్ ఇచ్చేందుకు రెడీ అయింది. ఈ సినిమాకు సంబంధించిన 'ఫస్ట్ బూస్టర్'ను సెప్టెంబర్ 24న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో సంప్రదాయ వాయిద్యమైన డోలు వాయిస్తూ సందడి చేస్తున్న మహిళల బృందం కనిపించడంతో.. సినిమా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మాత్రమే కాదు, పండగ వాతావరణంతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేయబోతోందన్న ఆసక్తి మరింత పెరిగింది.




## ఏఐ ఏఐనే... మనిషి మనిషే..!

### మనిషి స్థానాన్ని ఏఐ భర్తీ చేయలేదు

### టామ్ క్రూజ్ మాటలతో థియేటర్‌లో చప్పట్లు!

హాలీవుడ్ స్టార్ టామ్ క్రూజ్ ఏఐపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారాయి. లండన్‌లో జరిగిన బీఏఎఫ్‌టీఏ 'లైఫ్ ఇన్ పిక్చర్స్' కార్యక్రమంలో తన సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకున్న క్రూజ్.. సినిమాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెరుగుతున్న పాత్రపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. భవిష్యత్‌లో ఏఐ ఫిల్మ్‌మేకింగ్‌లో మరింత భాగమవుతుందని అంగీకరించిన ఆయన.. టెక్నాలజీ ఎంత పెరిగినా ప్రేక్షకులు నిజమైన అనుభూతిని కోరుకుంటారని స్పష్టం చేశారు. "మానవుడిని మించినది ఏదీ లేదు. క్రియేటివ్స్ సృష్టిస్తూనే ఉండాలి. ఇది వస్తోంది.. జరుగుతుంది. కానీ ప్రజలు నిజమైన విషయాలను చూడాలనుకుంటారు" అంటూ క్రూజ్ చేసిన వ్యాఖ్యలకు ప్రేక్షకుల నుంచి చప్పట్లు లభించాయి. "నేను ఎప్పుడూ మానవత్వాన్ని నమ్ముతాను" అన్న క్రూజ్ మాటలు హైలైట్‌గా నిలిచాయి. 'మిషన్: ఇంపాజిబుల్'కు వీడ్కోలు పలికిన తర్వాత ఇప్పుడు అలెజాండ్రో జీ. ఇనారిటు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డిగ్గర్'లో నటిస్తున్నారు. రిజ్ అహ్మద్, జాన్ గుడ్‌మన్, సాండ్రా హ్యూల్లర్ తదితరులతో కలిసి నటించిన ఈ చిత్రం అక్టోబర్ 2న థియేటర్లలోకి రానుంది.






### 1850ల ప్రేమకథకు పాటే ప్రాణం!

విజయ్ దేవరకొండ–రష్మిక మందన్న జోడీ మరోసారి మ్యాజిక్ చేయబోతోంది! ఇప్పటికే విడుదలైన టీజర్‌తో క్యూరియాసిటీ పెంచిన 'రణబాలి'.. ఇప్పుడు 'ఎందయ్యా సామి' పాటతో ప్రేమికుల హృదయాల్లోకి దూసుకెళ్లింది. చిన్న ప్రోమోకే వైరల్ రీల్స్, ఫ్యాన్స్ రియాక్షన్స్‌తో అదిరిపోయే స్పందన రాగా.. పూర్తి పాట మాత్రం ఆ అంచనాలను మరింత పెంచేలా మెలోడీ, భావోద్వేగం, విజువల్స్‌తో మాయ చేసింది. 1850ల నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథలో విజయ్ దేవరకొండ రణబాలి పాత్రలో, రష్మిక మందన్న జయమ్మగా కనిపించనున్నారు. సంప్రదాయ పెళ్లి వేడుకలు, కొత్త జంట సరదాలు, హృదయపూర్వక సంభాషణలతో పాతకాలపు తెలుగు ప్రేమకథల అందాన్ని పాట అద్భుతంగా ఆవిష్కరించింది. విజయ్–రష్మిక కెమిస్ట్రీ సహజంగా మెరిసిపోవడంతో పాటకు మరింత ఆకర్షణ వచ్చింది. అజయ్–అతుల్ సంగీతం, శ్వేతా మోహన్–అజయ్ గోగవాలే గాత్రం పాటకు ప్రాణం పోయగా.. సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి సాహిత్యం ప్రేమ, నమ్మకం, జీవితాంతం తోడుగా ఉండే బంధాన్ని అందంగా పలికించింది. అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న 'రణబాలి'పై 'ఎందయ్యా సామి' అంచనాలను మరింత ఆకాశానికెత్తింది.

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.